సంపుటి : 9
సంచిక : 339
సోమవారం
31 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.


SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
తాజా వార్తలు మరియు విశ్లేషణలు
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
ఇప్పుడే చదవండి!
Contact For Ads:
7579339999

## 30 ఏళ్ల వెలిగొండ కలను నిజం చేస్తున్నామన్న సీఎం

- మార్కాపురంలో కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందన్న సీఎం చంద్రబాబు
- నల్లమల కొండల గుండా నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలు
- తొలి దశలో లక్షలాది మందికి సాగు, తాగునీటి ప్రయోజనం
- రేపు వెలిగొండ పండుగ వద్ద కలుద్దామంటూ ప్రజలకు పిలుపు



**అమరావతి, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** మార్కాపురం జిల్లా గడ్డపై సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మూడు జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు పడనుందని, రేపు కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందని ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. కరవు పీడిత ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా కంటున్న వెలిగొండ కల, కృష్ణమ్మ జలాలతో కళ్లముందు నిజం కాబోతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం తనను భావోద్వేగానికి గురిచేస్తోందని, మనసుకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెలిగొండ కేవలం ఒక ప్రాజెక్టు కాదని, కరవుతో పోరాడిన రైతుకు భరోసా అని, ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు ఆరోగ్య భద్రత అని, వలస వెళ్లిన యువతకు సొంతగడ్డపై భవిష్యత్తును ఇచ్చే ప్రగతి మార్గమని ఆయన అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు మొదటి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు వివరించారు. ఈ మహాయజ్ఞం కోసం తమ భూములను, ఇళ్లను, పుట్టి పెరిగిన ఊళ్లను త్యాగం చేసిన 11 గ్రామాల మిగతా .. 2లో..

పోలవరం ప్రాజెక్టు సమీపంలో

## పులి సంచారం కలకలం

- రెండు దూడలపై దాడి చేసి చంపడంతో తీవ్ర భయాందోళన
- గతంలో పట్టుకుని పాపికొండల్లో వదిలిన పులేనని నిర్ధారణ
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ హెచ్చరిక
- పులిని బంధించేందుకు రంగంలోకి ప్రత్యేక నిపుణుల బృందాలు




**పోలవరం, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు సమీపంలో పెద్దపులి సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రాజెక్టు పరిధిలోని దేవరగొండి జంట టన్నెళ్ల వద్ద పులి తిరుగుతుండటంతో స్థానిక గ్రామ ప్రజలు, ప్రాజెక్టు సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారు. రెండు దూడలను చంపేయడంతో ఈ భయం మరింత పెరిగింది. అటవీ శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి పులిని మిగతా .. 2లో..

ఖర్గే సభావేదికను "శుద్ధీకరించిన" వారిపై

## ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

### రాహుల్‌గాంధీ డిమాండ్



**ఢిల్లీ, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఈనెల 8న కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న ఒక సభావేదికను "శుద్ధీకరించిన" ఘటనకు సంబంధించి పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ భాజపా-ఆర్‌ఎస్‌ఎస్‌లను తీవ్రంగా విమర్శించారు. ఖర్గే బహిరంగసభ వేదికను శుద్ధి చేసి అంటరానితనాన్ని ప్రోత్సహించిన వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఖర్గే పాల్గొన్న బహిరంగసభ వేదికను శుద్ధిచేయడం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ఉల్లంఘించడమే. ఇంతటి నేరం. జరిగినా మిగతా .. 2లో..

రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారంపై

## ఉక్రెయిన్ డ్రోన్ దాడి



**ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** రష్యాలోని పలు ప్రాంతాలపై ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడింది. కిరిషి ప్రాంతంలోని ఒక చమురు శుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడి చేయడంతో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గతంలో ఇదే కర్మాగారాన్ని మిగతా .. 2లో..

కంటెంట్ క్రియేటర్లు..

## యూట్యూబర్లకు మోదీ సూచన..!



**ఢిల్లీ, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** క్షణికమైన ఆనందాన్నిచ్చే మత్తు పదార్థాలు ఉజ్వల భవితను దెబ్బతీసి వ్యక్తిగత జీవితాన్ని అంధకారంలోకి నెట్టేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. మాదక ద్రవ్య రహిత సమాజం కోసం ప్రతినబూనాలని యువతకు పిలుపునిచ్చారు. ఎటువంటి మత్తు పదార్థాలకైనా బానిసలు కాకుండా దూరంగా ఉండేలా మానసిక, శారీరక దృఢత్వాన్ని కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అవగాహన కల్పించాలని కంటెంట్ క్రియేటర్లు, యూట్యూ బర్‌లకు సూచించారు. ఆదివారం మన్‌కీ బాత్ 137వ కార్యక్రమంలో మాట్లాడుతూ..ఈ మేరకు యువతకు దిశానిర్దేశం చేశారు. 'మాదక ద్రవ్య రహిత భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి వ్యక్తీ, కుటుంబం, సమాజం, దేశం యావత్తూ కలిసి రావాలని మిగతా .. 2లో..

ఆంధ్రా అబ్బాయితో అమెరికాలో కుమార్తె పెళ్లి..

## ఆన్‌లైన్‌లో అక్షింతలు చల్లారు!

- అమెరికాలో జరిగిన కూతురి పెళ్లికి వీసా సమస్యలతో హాజరు కాలేకపోయిన తల్లిదండ్రులు
- సూర్యాపేట జిల్లాకు చెందిన హిమబిందు, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన రోహిత్‌ల వివాహం
- వీడియో కాల్ ద్వారా నూతన వధూవరులను ఆశీర్వదించిన జయరాజు, జ్యోతి దంపతులు
- బంధుమిత్రులు, గ్రామస్థుల కోసం స్వగ్రామంలో ఘనంగా విందు ఏర్పాటు



**సూర్యాపేట, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** కన్నకూతురి వివాహాన్ని కళ్లారా చూసి, అక్షింతలు వేసి ఆశీర్వదించాలని ప్రతి తల్లిదండ్రులూ కలలు కంటారు. కానీ, కొన్నిసార్లు దూరాలు అడ్డుగోడలుగా నిలుస్తాయి. సరిగ్గా ఇలాంటి ఓ సంఘటనే సూర్యాపేట జిల్లాలో చోటుచేసుకుంది. వీసా సమస్యల కారణంగా అమెరికాలో జరిగిన తమ ఏకైక కుమార్తె వివాహానికి హాజరు కాలేకపోయిన తల్లిదండ్రులు, వీడియో కాల్ ద్వారానే వేడుకను వీక్షించి నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివరాల్లోకి వెళితే, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం గ్రామానికి చెందిన జయరాజు, జ్యోతి దంపతుల ఒక్కగానొక్క కుమార్తె హిమబిందు. ఆమె అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన రోహిత్‌తో మిగతా .. 2లో..

హైదరాబాద్‌లో నర్సుది

## హత్యేనని తేల్చిన పోలీసులు

- అత్యాచార యత్నాన్ని ప్రతిఘటించడంతో గొంతు నులిమి హత్య
- బీహార్‌కు చెందిన సైనావుల్లా అనే వ్యక్తి అరెస్ట్
- నిందితుడికి కఠిన శిక్ష విధించాలని కుటుంబసభ్యుల ఆందోళన

**హైదరాబాద్, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 21 ఏళ్ల నర్సు అనుమానాస్పద మృతి కేసులో మిస్టరీ వీడింది. ఆమెది హత్యేనని పోలీసులు నిర్ధారించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన బీహార్ వాసి సైనావుల్లాను అరెస్ట్ చేశారు. అత్యాచార యత్నాన్ని ఆమె తీవ్రంగా ప్రతిఘటించడంతోనే గొంతు నులిమి హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. వివరాల్లోకి వెళితే, కొత్తగూడెం జిల్లాకు చెందిన యువతి ఏడు నెలల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్ వచ్చింది. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. విధుల్లో భాగంగా ఆమె ఆసుపత్రిలోనే కేటాయించిన గదిలో నివసిస్తోంది. శనివారం మధ్యాహ్నం గదిలోకి వెళ్లిన ఆమె ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో ఆసుపత్రి సిబ్బందికి అనుమానం వచ్చింది. వారు తలుపులు విరగ్గొట్టి చూడగా, యువతి నేలపై విగతజీవిగా పడి ఉంది. ఆమె శరీరంపై గాయాలు ఉండటంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, మిగతా .. 2లో..

## విజయసాయిరెడ్డిని కేఏ పాల్‌తో పోల్చిన బొత్స

- వైసీపీలో సజ్జల నెంబర్ 1, జగన్ నెంబర్ 2 అంటూ విజయసాయి వ్యాఖ్యలు
- ఈ కామెంట్లపై తీవ్రంగా స్పందించిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ
- ఆయన వ్యాఖ్యలతో సమయం వృథా చేసుకోవద్దని పార్టీ శ్రేణులకు సూచన
- విజయసాయి వ్యాఖ్యలతో వైసీపీలో బయటపడిన అంతర్గత విభేదాలు



**తాడేపల్లి, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు వైసీపీ నాయకత్వాన్ని తీవ్ర ఆగ్రహానికి గురిచేశాయి. వైసీపీలో సజ్జల రామకృష్ణారెడ్డి నెంబర్ 1 అని, జగన్ నెంబర్ 2 అని ఆయన వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఈ క్రమంలో, పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ.. విజయసాయి రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "విజయసాయి రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని నేను స్పష్టంగా చెబుతున్నాను. ఆయన మాటలను సీరియస్‌గా తీసుకోవాల్సిన మిగతా .. 2లో..

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి..




- రాజకీయ సమీకరణాల వల్లే పదవి ఇవ్వడంలో ఆలస్యం జరిగిందని వెల్లడి
- సెప్టెంబర్ నాటికి పార్టీలోని అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ధీమా
- అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీపై వచ్చే నెలలో స్పష్టత
- కాంగ్రెస్ ఒక మహాసముద్రమని, అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఉంటుందని వ్యాఖ్య
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది నిజమేనని ఆయన అంగీకరించారు. అదే సమయంలో, పార్టీలో నెలకొన్న చిన్న చిన్న అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలన్నీ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తాయని స్పష్టం చేశారు. పార్టీలోని నాయకుల అసంతృప్తిపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ ఒక మహా సముద్రం లాంటిది. ఇక్కడ నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. అయితే, అదే సమయంలో పార్టీ క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా ఆలస్యం జరిగిందని వివరించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఓపిక చాలా అవసరమని ఆయన సూచించారు. మంత్రులు కొండా సురేఖ, చిన్నారెడ్డి వంటి నేతల విషయంలో నెలకొన్న వివాదాలపై అడిగినప్పుడు, ఆ అంశాలను పార్టీ అధిష్ఠానం చూసుకుంటోందని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని, సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో పార్టీలోని సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని, నాయకుల అసంతృప్తి తొలగిపోతుందని, నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై చర్చ ఊపందుకుంది. సెప్టెంబర్‌లో జరగబోయే కేబినెట్ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమనే ఊహాగానాలు బలపడ్డాయి.

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణపై

## తెలంగాణ ప్రభుత్వం దృష్టి




- తుమ్మిడిహట్టి బ్యారేజీ: మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యమన్న మంత్రి ఉత్తమ్
- భారీ లిఫ్టులు లేకుండా గ్రావిటీ ద్వారా 80 టీఎంసీల తరలింపునకు ప్లాన్
- సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల చర్చలు

**తెలంగాణా, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద నిర్దేశిత ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ అంగీకారం పొందడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో, ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీని నిర్మిస్తే, ఎలాంటి భారీ లిఫ్టుల అవసరం లేకుండానే సుమారు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను గ్రావిటీ ద్వారా సహజ సిద్ధంగా సుందిళ్ల బ్యారేజీకి తరలించవచ్చని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన అంశాలపై సమగ్రంగా చర్చించారు. బ్యారేజీ నిర్మాణం వల్ల చేకూరే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు ఉన్న సాధ్యాసాధ్యాలపై విస్తృతంగా సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం జరిపిన సంప్రదింపుల ఫలితంగానే, కేంద్రం చొరవతో ఇరు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలు ప్రారంభం కావడం ఒక సానుకూల పరిణామమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

# 30 ఏళ్ల వెలిగొండ కలను నిజం చేస్తున్నామన్న సీఎం

నిర్వాసితులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. నల్లమల కొండలను చీల్చుకుంటూ నల్లమల సాగర్‌లోకి కృష్ణమ్మ జలాలు దూసుకువస్తాయని, ఆ ప్రాంత ప్రజల దశాబ్దాల నీటి కష్టాలను సమూలంగా కడిగేస్తాయని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. రేపటి నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులు ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త రెక్కలు తొడుగుతాయని అన్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని 'వెలిగొండ పండుగ' వద్ద కలుద్దామంటూ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

### పోలవరం ప్రాజెక్టు సమీపంలో

# పులి సంచారం కలకలం

బంధించేందుకు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే, శనివారం రాత్రి పోలవరం ప్రాజెక్టు పాత దేవరగుండి టన్నెల్ వద్ద ఉన్న రెగ్యులేటర్ సమీపంలో స్థానికులు పులిని గమనించారు. అక్కడే ఉన్న రెండు దూడలపై అది దాడి చేసి చంపేసింది. ఈ ఘటనతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. ఆదివారం ఉదయం ముంపు గ్రామమైన దేవరగొండిలోని జంట టన్నెళ్ల వద్ద కూడా పులి కదలికలను అధికారులు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు ప్రాజెక్టు ఇంజనీర్లు, ఏజెన్సీ ప్రతినిధులు, స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. రాత్రి సమయాల్లో ఒంటరిగా బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**గతంలో పట్టుబడి, మళ్లీ ప్రత్యక్షం**

ఈ ఏడాది జనవరిలో ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోకి ప్రవేశించిన ఈ పులి, అప్పట్లో బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలాల్లోనూ సంచరించి కలకలం రేపింది. ఆ తర్వాత తూర్పుగోదావరి జిల్లా అడవుల్లోకి వెళ్లింది. రాయవరం సమీపంలో దీని సంచారం ఎక్కువ కావడంతో, పుణే నుంచి వచ్చిన ప్రత్యేక బృందం ఫిబ్రవరిలో దీనిని సురక్షితంగా పట్టుకుంది. అనంతరం పులిని విశాఖపట్నం జూకు తరలించి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆధునిక కాలర్ ఐడీని అమర్చారు. పోలవరం ప్రాంతంలోని పాపికొండల అభయారణ్యంలో దానిని తిరిగి వదిలిపెట్టారు. అయితే, అది అభయారణ్యానికే పరిమితం కాలేదు. ఏప్రిల్ 14న గోదావరి నదిని దాటి కొట్టూరు ముంపు గ్రామంలోకి ప్రవేశించి, అప్పటి నుంచి ఏలూరు, పోలవరం, తూర్పుగోదావరి జిల్లాల మధ్య సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది.

### ఖర్గే సభావేదికను "శుద్ధీకరించిన" వారిపై

# ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

ప్రభుత్వం ఇంతవరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇప్పటికైనా వేదికను శుద్ధిచేసిన వారిపై చట్ట ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదుచేయాలి. ప్రధానమంత్రి మోదీ తాను దేశంలోని అన్ని వర్గాలవారికీ ప్రధానమంత్రినని చెప్పుకుంటున్నారు. కానీ ఉత్తరాఖండ్‌లో వారి పార్టీ అధ్యక్షుడు మహేంద్రభట్ మాత్రం "శుద్ధీకరణ"ను సమర్థిస్తున్నారు. అక్కడ వేదికను "శుద్ధి"చేసిన వారంతా ఆర్ఎస్ఎస్ వారే. అందువల్ల బాధ్యులందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదుచేసేలా ప్రధానమంత్రి ఉత్తర్వులు ఇవ్వాలి. దేశంలో రెండు భావజాలాల మధ్య పోరాటం సాగుతోంది. ఈ పోరాటంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ, జవహర్లాల్ నెహ్రూలు రూపొందించిన భారత రాజ్యాంగం ఒకవైపు, భాజపా-ఆర్ఎస్ఎస్‌లు మరోవైపు ఉన్నాయి. వేల సంవత్సరాలుగా దళితులపై అత్యాచారాలు జరుగుతున్నాయి. ఈ దేశంలోని దళితులు ఎదగకూడదని, గౌరవంగా జీవించకూడదని భాజపా, ఆర్ఎస్ఎస్‌లు కోరుకుంటున్నాయి. పైకి చెప్పేది ఏదైనా వారి వాస్తవ మనస్తత్వం మాత్రం ఇదే. అందువల్ల వెంటనే ఉత్తరాఖండ్ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాల్సిందే. కాంగ్రెస్ అధ్యక్షుడికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది న్యాయం చేయమని డిమాండ్ చేస్తున్నాం" అని రాహుల్ పేర్కొన్నారు. న్యాయం జరుగుతుందని మీరు నమ్ముతున్నారా? అన్న ప్రశ్నకు బదులిస్తూ "ఈ ఘటనకు బాధ్యులైనవారు ఎవ్వరూ తప్పించుకోలేరు. ఈరోజు కాకపోయినా రేపైనా ఖర్గేకి న్యాయం జరుగుతుందని మేం నమ్ముతున్నాం. మా డిమాండ్ ఫలించి కచ్చితంగా ఎఫ్ఐఆర్ నమోదుచేస్తారు" అని ధీమా వ్యక్తం చేశారు. ఇది కేవలం ఖర్గేకు సంబంధించిన అంశంకాదని, ఈ దేశంలో ప్రతి దళితునికి సంబంధించిన విషయమని అన్నారు. ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడికి వ్యతిరేకంగా ఇలాంటి దురాగతానికి పాల్పడ్డారంటే పాఠశాలల్లో దళిత బాలబాలికల విషయంలో ఎలా ప్రవర్తిస్తుంటారో ఊహించుకోవచ్చు అని అన్నారు. ఇది భాజపా ఆలోచనా విధానానికి అద్దంపడుతోందని, అందుకే దానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని కాంగ్రెస్ నేత తెలిపారు. అంటరానితనం నేరం అని రాజ్యాంగం చెబుతోందని, వేదికను శుద్ధీకరించడం అన్నది అంటరానితనాన్ని ప్రోత్సహించడం కిందికే వస్తుందన్నారు. ఈ పనిని సమర్థించిన భాజపా ఉత్తరాఖండ్ అధ్యక్షుడు మహేంద్రభట్‌ను కాంగ్రెస్ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఇప్పుడు బంతి భాజపా కోర్టులో ఉంది. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటే సరేసరి లేదంటే మేం స్పందించాల్సి ఉంటుంది అన్నారు. వారి చర్యలన్నిటిపై తమ నుంచి అంతకంటే పెద్ద ప్రతిచర్య ఉంటుందని హెచ్చరించారు.

**అందుకే శుభ్రం చేశాం: భాజపా**

అయితే రాహుల్ గాంధీ వ్యాఖ్యలను భాజపా ఖండించింది. కేవలం తన రాజకీయ ప్రయోజనాల కోసం సమాజాన్ని విభజించేలా రాహుల్ ఈ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ఖర్గే కార్యక్రమం పూర్తి చేసుకున్న తర్వాత వేదిక అపరిశుభ్రంగా ఉన్న కారణంగానే అక్కడ పూజ నిర్వహించామని, పక్కనే ఒక ఆలయం కూడా ఉందని దిల్లీలోని తమ ప్రధాన కార్యాలయంలో భాజపా అధికార ప్రతినిధులు సుధాన్షు త్రివేది, గురు ప్రకాశ్ పశ్వాన్‌లు చెప్పారు. కాంగ్రెస్ అబద్ధాలు చెప్తోంది: రాహుల్ వ్యాఖ్యలపై భాజపా స్పందించింది. దళితులకు మోదీ ప్రభుత్వం అత్యున్నత గౌరవాన్ని ఇచ్చిందని నొక్కిచెప్తూ.. కాంగ్రెస్ అబద్ధాలు చెప్తోందని విమర్శించింది. "కాంగ్రెస్, ఖర్గేలు అబద్ధాలు చెప్పటంలో దిట్టలు" అని భాజపా ఎంపీ రవి శంకర్ ఆరోపించారు.

# ఉక్రెయిన్ డ్రోన్ దాడి

కీవ్ తీవ్రంగా దెబ్బతీయడంతో మాస్కో తిరిగి పునరుద్ధరించింది. మరికొద్ది రోజుల్లో కర్మాగారంలో పనులు తిరిగి ప్రారంభం అవ్వాల్సి ఉండగా ఈ దాడి జరగడం గమనార్హం. రోజుకు 4,00,000 బ్యారెళ్ల సామర్థ్యం గల ఈ ప్లాంట్ డీజిల్, గ్యాసోలిన్, ఫ్యూయల్ ఆయిల్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఉక్రెయిన్ ప్రయోగించిన దాదాపు 494 డ్రోన్లను విజయవంతంగా కూల్చేసినట్లు రష్యా వెల్లడించింది. ఈ నెలలో 20కి పైగా రిఫైనరీలపై ఉక్రెయిన్ దాడులు చేసినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌కు సరఫరాను కొనసాగించడానికి.. డీజిల్ ఎగుమతులపై నిషేధాన్ని పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. దాడులకు ప్రతిస్పందనగా ఉక్రెయిన్ ఇంధన కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. వరుస దాడులు కొనసాగుతుండడంతో రష్యాలో గ్యాసోలిన్ కొరత ఏర్పడింది. మరోవైపు శనివారం తెల్లవారుజామున కీవ్‌పై మాస్కో దాడి చేయడంతో.. పేలుడు పదార్థాలు నిల్వ ఉంచిన గిడ్డంగిలో అగ్నిప్రమాదం చోటుచేసుకుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 38మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోవడంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. పేలుడు పరికరాలను గుర్తించి, నిర్వీర్యం చేయడానికి పైరోటెక్నిక్ బృందాలు కృషి చేస్తున్నట్లు తెలియజేశారు.

### కంటెంట్ క్రియేటర్లు..

# యూట్యూబర్లకు మోదీ సూచన..!

మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యసనం నుంచి విముక్తులైన వారిని సమాజం అక్కున చేర్చుకుని గౌరవించాలన్నారు. సమాజమద్దతు, యోగ, ధ్యానం, దృఢచిత్తం, ఆత్మవిశ్వాసం ద్వారా మత్తుపదార్థాలకు దూరం కావొచ్చన్నారు. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో యువత పెద్ద మొత్తంలో హాజరవుతున్నారని పేర్కొన్నారు.

**పీఎం స్వనిధి యోజన..**

వీధి వ్యాపారుల కోసం తీసుకొచ్చిన 'పీఎం స్వనిధి యోజన' లక్షల మంది మహిళలకు ఉపయోగపడుతోందని మోదీ పేర్కొన్నారు. దీనిద్వారా దాదాపు 46శాతం మంది మహిళలు తమ వ్యాపారాలను విస్తరించుకుంటూ.. ఆదాయాన్ని పెంచుకుంటున్న అంశాన్ని గుర్తుచేశారు.

**మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం**

ప్రధాని మోదీకి మరో అరుదైన గౌరవ పురస్కారం లభించింది. ఉజ్బెకిస్థాన్ అత్యున్నత 'ఒలియ్ దరాజాలి దస్లిక్' పురస్కారాన్ని అందుకున్నారు. ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆయనకు అవార్డు అందజేశారు. ఇది మోదీకి లభించిన 36వ అంతర్జాతీయ పురస్కారం. ఈ అవార్డు అందుకోవడం గర్వంగా ఉందని..దీనిని ఇరుదేశాల మధ్య ఉన్న శాశ్వత బంధానికి అంకితం చేస్తున్నారని ప్రధాని పేర్కొన్నారు. యురేనియం సరఫరా కోసం భారత్-ఉజ్బెకిస్థాన్ దీర్ఘకాలిక ఒప్పందాన్ని చేసుకోనున్నట్లు ప్రకటించారు. మరిన్ని ఒప్పందాలపైనా చర్చలు జరుపుతున్నామన్నారు.

### ఆంధ్రా అబ్బాయితో అమెరికాలో కుమార్తె పెళ్లి..

# ఆన్‌లైన్‌లో అక్షింతలు చల్లారు!

ఆమెకు పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో వీరిద్దరూ అమెరికాలోనే వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. కూతురి పెళ్లిని దగ్గరుండి జరిపించాలని భావించిన జయరాజు, జ్యోతి దంపతులు అమెరికా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, వీసా సంబంధిత సమస్యలు తలెత్తడంతో వారి ప్రయాణం చివరి నిమిషంలో ఆగిపోయింది. దీంతో వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. అయినప్పటికీ, టెక్నాలజీ సాయంతో వారు తమ కుమార్తె వివాహ వేడుకలో పాలుపంచుకున్నారు. అమెరికాలో హిమబిందు, రోహిత్‌ల వివాహం జరుగుతుండగా, ఇక్కడ స్వగ్రామంలోని తమ నివాసం నుంచి తల్లిదండ్రులు వీడియో కాల్ ద్వారా వేడుకను ప్రత్యక్షంగా వీక్షించారు. కళ్లారా కూతురి పెళ్లిని చూడలేకపోయామన్న బాధ ఉన్నప్పటికీ, ఆన్‌లైన్‌లోనే నూతన దంపతులను మనసారా ఆశీర్వదించారు. అంతేకాకుండా, బంధుమిత్రులు, గ్రామస్థుల కోసం తమ గ్రామంలో ఘనంగా విందు భోజనాలు ఏర్పాటు చేసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ ఘటన స్థానికంగా అందరి దృష్టిని ఆకర్షించింది.

### హైదరాబాద్‌లో నర్సుది

# హత్యేనని తేల్చిన పోలీసులు

ఘటనా స్థలంలోని ఆధారాలను బట్టి ఇది హత్యగా అనుమానించారు. విచారణలో భాగంగా, ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సైనావుల్లా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో అతను నేరం అంగీకరించాడు. శనివారం మధ్యాహ్నం కిటికీలోంచి నర్సు గదిలోకి దూకి ఆమెపై అత్యాచారానికి ప్రయత్నించినట్లు తెలిపాడు. బాధితురాలు గట్టిగా కేకలు వేస్తూ ప్రతిఘటించడంతో, భయపడిపోయి ఆమె గొంతు నులిమి హత్య చేసి పారిపోయినట్లు వివరించాడు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. మృతురాలి కుటుంబసభ్యులతో పాటు కాంగ్రెస్, బీజేపీ నాయకులు పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. నిందితుడిని కఠినంగా శిక్షించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# విజయసాయిరెడ్డిని కేఏ పాల్‌తో పోల్చిన బొత్స

పని లేదు. రాజకీయాల్లో ఇలాంటి వాళ్లు వస్తూ పోతూ ఉంటారు. ఇంతకుముందు మనకు కేఏ పాల్ ఒకరు ఉండేవారు, ఆయన ఏదేదో మాట్లాడుతుండేవారు. ఇప్పుడు విజయసాయిరెడ్డి రెండో వ్యక్తిగా తయారయ్యారు. ఆయన మాటలకు విలువ ఇచ్చి స్పందించడం అంటే మన సమయాన్ని మనం వృథా చేసుకోవడమే. చూడండి, శుభ్రంగా సాయంత్రం వేళ ప్రశాంతంగా కూర్చున్నాం. ఇలాంటి సమయంలో ఆ పనికిమాలిన మాటల గురించి ఎందుకు మాట్లాడాలి? దానివల్ల నా సమయం వృథా అవ్వడమే కాకుండా, అసలు విషయాలైన ప్రజా సమస్యల నుంచి మన దృష్టి మళ్లుతుంది. ప్రజల సమస్యలు ఎన్నో ఉన్నాయి, వాటిపై దృష్టి పెట్టాలి. అంతేకానీ, ఇలాంటి వాటి కోసం కాదు. ఆయనకేదో అది పెద్ద విషయంలా అనిపిస్తే, దానికోసం ఒక ప్రెస్ మీట్ పెట్టుకోమనండి. బహిరంగంగా చెప్పుకోమనండి. అంతేగానీ, దానికోసం మేం సమయం కేటాయించం. అనవసరంగా ఇలాంటి విషయాల గురించి చర్చించి మన విలువైన సమయాన్ని పాడుచేసుకోవడం ఎందుకు? కాబట్టి, ఆ విషయం గురించి మళ్లీ మళ్లీ అడిగి మీ సమయం, నా సమయం వృథా చేయొద్దని కోరుతున్నాను" అని బొత్స పేర్కొన్నారు.

### యూరప్‌లోనే ఎత్తైన పర్వతాన్ని

# అధిరోహించిన భారత మహిళ



**ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాకు చెందిన 43ఏళ్ల శివానీ మెహ్రోత్రా యూరప్‌లోనే అత్యంత ఎత్తైన మౌంట్ ఎల్బ్రస్ (వీశీబత్ జుశ్రీఎతీబం) పర్వతాన్ని అధిరోహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ఆమె రష్యాలోని మౌంట్ ఎల్బ్రస్‌పై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. వృత్తిరీత్యా యోగా టీచర్ అయిన శివానీ ఫుల్-హాఫ్ మారథాన్‌లతో పాటు 50 కిలోమీటర్ల పరుగును కూడా పూర్తి చేసి అల్ట్రా-రన్నర్‌గా పేరుపొందారు. ఆగస్టు 8న ఆమె ముంబయి నుంచి దుబాయ్ మీదుగా రష్యా చేరుకున్నారు. అనంతరం స్థానిక ట్రెక్కింగ్ కంపెనీ సహకారంతో ఆగస్టు 15న నాలుగు గంటలపాటు ట్రెక్కింగ్ చేసి, మౌంట్ ఎల్బ్రస్ శిఖరాన్ని చేరుకున్నారు. తాజాగా భారత్‌కు తిరిగి వచ్చిన ఆమె తన అనుభవాలను పీటీఐతో పంచుకున్నారు. 'పర్వతాలను అధిరోహించా లని కాలేజీ సమయంలో కలలుకనేదాన్ని. నా కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో వాటిని నిజం చేసుకోగలుగుతున్నా. హిమాలయాలలోని పలు ప్రాంతాలతో పాటు కశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్‌లలోని పలు పర్వతాలను ఎక్కాను. మౌంట్ కిలిమంజారోనూ అధిరోహించాను. ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించడమే నా ఆశయం. వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నమ్ముతాను. ఒక ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని సాధించేటప్పుడు వయసు కంటే పట్టుదల, క్రమశిక్షణే ముఖ్యం' అని శివానీ పేర్కొన్నారు.

# సైప్రస్‌లో.. 270 మందితో వెళ్తున్న పడవ బోల్తా

**ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** సైప్రస్‌లో పడవ ప్రమాదం చోటుచేసుకుంది. ఉత్తర సైప్రస్‌లోని కైరేనియా నుంచి తుర్కియేలోని టౌచుకు సుమారు 270 మంది ప్రయాణికులతో వెళ్తుండగా బోల్తా పడింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు.. దాదాపు 159 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగాయి. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, మిగతా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని కైరేనియా మేయర్ మురాత్ సెన్‌కుల్ వెల్లడించారు. మరోవైపు, ఈ ఘటనలో భారీ ప్రాణనష్టం జరిగినట్లు స్థానిక మీడియా పేర్కొంది. కోస్టు గార్డుకు చెందిన పడవలు, హెలికాప్టర్లు సహా ప్రయాణికుల పడవలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. బాధితులను ఆసుపత్రులకు చేర్చేందుకు తీరంలో అంబులెన్సులను సిద్ధంగా ఉంచారు.



అయితే, ప్రమాద సమయంలో పడవలో కచ్చితంగా ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత లేదు.

# ఐఎస్‌టీ అమలుకు కేంద్రం కొత్త రూల్స్

### విమానాశ్రయాలు, బ్యాంకింగ్ రంగాల్లో ఇక ఒకే సమయం నిర్బంధం!



**ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ ప్రామాణిక సమయం అమలుపై కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కీలక నిర్ణయం తీసుకుంటూ కొత్త నోటిఫికేషన్ విడుదల చేసింది. లీగల్ మెట్రాలజీ చట్టం-2009 లోని సెక్షన్ 52 ద్వారా సంక్రమించిన అధికారాలతో 'లీగల్ మెట్రాలజీ (ఇండియన్ స్టాండర్డ్ టైమ్) రూల్స్-2026' పేరుతో ఈ రూల్స్‌ను తీసుకొచ్చింది. కొఆర్డినేటెడ్ యూనివర్సల్ టైమ్ కి 5.30 గంటలు జతచేయడం ద్వారా వచ్చే సమయాన్నే భారత్‌లో అధికారిక ప్రమాణంగా ఖరారు చేశారు. ఈ సమయాన్ని గంటలు, నిమిషాలు, సెకండ్ల రూపంలోనే ప్రదర్శించాల్సి ఉంటుంది. నోటిఫికేషన్ వెలువడిన 180 రోజుల తర్వాత నుంచి ఈ నిబంధనలు అమలులోకి రానున్నాయి. దీని ప్రకారం దేశంలోని అన్ని రవాణా, వాణిజ్య, ఆర్థిక, చట్టపరమైన ఒప్పందాలకు ఐఎస్‌టీ మాత్రమే ప్రాతిపదికగా ఉంటుంది. రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ సమయాన్ని ప్రదర్శించడం తప్పనిసరి. బ్యాంకింగ్, టెలికాం, ఇంధనం, డేటా సెంటర్ల లాంటి కీలక రంగాలు తమ నెట్‌వర్క్ వ్యవస్థలను ఇస్రో 'నావిక్' లేదా ప్రాంతీయ ప్రామాణిక ప్రయోగశాలల ఆధారంగా సమకాలీక ˇరించుకోవాల్సి ఉంటుంది. అధికారికంగా గుర్తింపు లేని ఇతర విదేశీ కాలమానాలను ప్రామాణికంగా తీసుకోవడాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. దేశ ఆర్థిక, జాతీయ భద్రత దృష్ట్యా రక్షణ, విద్యుత్, టెలికమ్యూనికేషన్స్, ఫైనాన్స్, డేటా సెంటర్లు అన్నీ తమ గడియార వ్యవస్థలను నావిక్ లేదా ఇతర గుర్తింపు పొందిన వ్యవస్థలతో అనుసంధానించుకోవాలి. ఈ నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై లీగల్ మెట్రాలజీ డైరెక్టర్ విచారణ జరిపి కఠినమైన జరిమానాలు, చట్టపరమైన శిక్షలు విధించడం ఖాయం. డిజిటల్ విప్లవం వేగవంతమైన వేళ దేశమంతటా ఒకే ప్రామాణిక సమయం ఉండటం అత్యంత ఆవశ్యకం. విదేశీ టైమ్ సర్వర్లపై ఆధారపడటం వల్ల తలెత్తే సైబర్ భద్రతా ముప్పులకు, డిజిటల్ లావాదేవీల గందరగోళానికి చెక్ పెట్టేందుకు కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం సరైన దిశలో పడిన అడుగు. ఈ రూల్స్‌ను వ్యాపార, సాంకేతిక రంగాలు కచ్చితంగా పాటించి తీరాలి; ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు తప్పవు.

# ఎడిటర్ వాయిస్

## రాజకీయ పార్టీలకు మత మరక మైనస్సేనా..?

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక పార్టీ అధికారిక వైఖరి, నేతల వ్యక్తిగత విశ్వాసాల చుట్టూ జరుగుతున్న చర్చ తీవ్ర నిరసనలకు, విమర్శలకు వేదికగా మారింది. రాజకీయాల్లో నాయకులు భావజాలానికి కట్టుబడి పనిచేయడం సహజం. కానీ, ఒక పార్టీలో క్రియాశీలకంగా ఉండటానికి లేదా అధినాయకత్వానికి దగ్గరై పదవులు పొందడానికి నేతలు తమ మత విశ్వాసాలను మార్చుకోవడం, లేదా మారినట్లు నటించడం అనే ఆరోపణలు ప్రజాస్వామ్య వ్యవస్థపై తీవ్ర ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

మత విశ్వాసం అనేది ప్రతి వ్యక్తి రాజ్యాంగబద్ధమైన వ్యక్తిగత హక్కు. అయితే, కేవలం పదవుల కోసం, రాజకీయ మనుగడ కోసం తమ మూలాలను, సొంత విశ్వాసాలను పక్కనపెట్టి ప్రార్థనలకు హాజరుకావడం లేదా బయటకు ఒక రకంగా, లోపల మరో రకంగా వ్యవహరించడం ప్రజాసేవ లక్షణంగా అనిపించుకోదు. రాజకీయం కోసం స్వీయ విశ్వాసాలను, దేవుడిని కూడా సాధనంగా వాడుకునే ధోరణి.. ఇలాంటి నాయకత్వం యొక్క నిబద్ధతను, వ్యక్తిత్వాన్ని శంకించేలా చేస్తుందనడంలో సందేహం లేదు.

ఇటీవల కాలంలో బహిర్గతమవుతున్న కొన్ని సంఘటనలు... ఆ పార్టీ నేతల వ్యాఖ్యలు చూస్తుంటే ఆ పార్టీ ఏ పునాదుల ప్రాతిపదికన రాజకీయం చేస్తుందో ? అర్థమవుతోంది. ఇక పార్టీలో స్థానం నిలుపుకోవడానికి లేదా అధినాయకత్వానికి దగ్గర అవ్వడానికో, పదవుల కోసమో కొందరు నేతలు తమ స్వంత ధర్మాన్ని, విశ్వాసాలను పక్కనపెట్టడం లాంటి పరిణామాలు చూస్తుంటే.. దానిని రాజకీయ పరిణతి అనాలా లేక వ్యక్తిత్వ లొంగుబాటు అనాలా? అన్న ప్రశ్న వస్తోంది.

సొంత నమ్మకాలకే కట్టుబడి ఉండలేని నేతలు సామాన్య ప్రజలకు ఏ మేరకు విశ్వసనీయంగా ఉంటారనే అనుమానం రావడం సహజం. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం, అంతర్గత ఆధిపత్యం కోసం మతాన్ని ఒక అర్హతగా లేదా రాజకీయ ముసుగుగా మార్చుకోవడం ప్రజాస్వామ్య విలువలకు తీవ్ర విఘాతం కలిగిస్తుంది. రాజకీయాన్ని, మత విశ్వాసాలను వేర్వేరుగా చూడటమే ఆరోగ్యకరమైన రాజకీయ సంస్కృతికి చిహ్నం. అవకాశవాదంతో వ్యవహరిస్తూ, ప్రజల నమ్మకంతో ఆడుకునే నేతలను సమాజం ఏ విధంగా గమనిస్తుందో, భవిష్యత్తులో



ప్రజాస్వామ్య వేదికపై వారి ప్రవర్తనకు ఎలాంటి తీర్పు లభిస్తుందన్నది వేచి చూడాలి.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

రాఖీ పండుగకు వచ్చి..

## నీటి కుంటలో జారిపడి అన్నదమ్ముల మృతి



**ములుగు, విశ్వం వాయిస్ న్యూస్ :** ములుగు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అన్నదమ్ములు నీటికుంటలో జారిపడి మృతిచెందారు. స్థానికుల కథనం ప్రకారం.. మంగపేట మండలం కమలాపూర్‌కు చెందిన మాలోతు యాకూబ్-స్వాతి దంపతులకు ఇంటర్, పదోతరగతి చదివే వినయ్ కిశోర్ (16), రాజేశ్ (14) కుమారులున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా స్వాతి తన ఇద్దరు కుమారులను తీసుకుని.. ములుగు మున్సిపాలిటీ పరిధి గణేశ్‌లాల్‌పల్లిలోని పుట్టింటికి వెళ్లారు. ఆదివారం సెలవు కావడంతో పిల్లలిద్దరినీ అక్కడే ఉంచి.. ఆమె తిరిగి కమలాపూర్ వెళ్లారు. ఆదివారం సాయంత్రం బంధువుల అబ్బాయితో కలిసి ఆ ఇద్దరు బాలురు గ్రామ సమీపంలోని మొండికుంటకు బహిర్భూమికి వెళ్లారు. ఈ క్రమంలో కుంటలో మొరం మట్టి కోసం తీసిన గుంతలో అన్నదమ్ములు జారిపడి మునిగిపోయారు. గమనించిన మరో బాలుడు గ్రామస్థులకు చెప్పాడు. వారు వెంటనే అక్కడికి చేరుకుని గాలించగా అప్పటికే వారు మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వ్యవసాయ కూలీ పనులు చేసుకునే యాకూబ్ దంపతులు.. కన్నబిడ్డలు మృతిచెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ..

### 50 తులాల బంగారు ఆభరణాలు మాయం



**మాక్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** నిజామాబాద్ జిల్లా మాక్లూరు మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు. 50 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. వివరాల్లో వెళ్లితే.. గ్రామానికి చెందిన శ్రీనివాస్ రావు రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుటుంబసభ్యులతో కలిసి నాలుగురోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండుగులు శ్రీనివాస్ రావు ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు ఉదయం ఇంటి యజమానికి సమాచారం అందించారు. బీరువాలో ఉన్న 50 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.10వేల నగదు చోరీ అయ్యానని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అనిల్ రెడ్డి పేర్కొన్నారు.

అత్యాచారానికి యత్నించి.. అంతమొందించి..

## నర్సు మృతి కేసులో పురోగతి

**పహాడీషరీఫ్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన నర్సు (21) కేసులో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ఆమెను బిహార్ వాసి హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. సైనా ఉల్లా అనే వ్యక్తి కిటికీ నుంచి నర్సు గదిలోకి దూకి.. ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. బాధితురాలు ప్రతిఘటించగా.. గొంతు నొక్కి కేకలు వేయకుండా అడ్డుకోవడంతో ఆమె మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు పారిపోతుండగా పట్టుకుని.. విచారించగా నేరం అంగీకరించాడు. సైనా ఉల్లా ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్, భాజపా నాయకులు, కుటుంబ సభ్యులు.. న్యాయం చేయాలని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు.

**ఏమైందంటే..**

కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన యువతి ఏడు నెలల క్రితం మహేశ్వరంలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చారు. ఓ ఆసుపత్రిలో నర్సుగా చేరారు. అదే ఆసుపత్రికి చెందిన గదిలో ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం గదికి వెళ్లి.. మళ్లీ ఆసుపత్రికి తిరిగిరాలేదు. యాజమాన్యం ఫోన్ చేసినా స్పందించకపోవడంతో.. ఆమె ఉంటున్న గదికి సిబ్బందిని పంపించారు. గది తలుపులు లోపలి నుంచి గడియపెట్టి ఉండటంతో కిటికీ సందులోంచి చూడగా ఆమె నేలపై పడి ఉంది. తలుపు విరగ్గొట్టి లోపలికి వెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న పహాడీషరీఫ్ పోలీసులు క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఒంటిపై గాయాలు గమనించి.. ఆమె మృతిపై అనుమానముందని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెట్టును ఢీకొన్న బైక్..

## ముగ్గురు యువకుల దుర్మరణం

**శ్రీ సత్యసాయి, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ సత్యసాయి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. నల్లమాడ మండలం అరవవాండ్లపల్లి వద్ద చెట్టును ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు మృతిచెందారు. అనంతరం మంటలు చెలరేగి ద్విచక్రవాహనం దగ్ధమైంది. మృతులను పుట్టపర్తికి చెందిన అనిల్, కొత్త చెరువుకు చెందిన అర్జున్, గోరంట్లకు చెందిన దీక్షిత్‌గా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



# విశ్వవాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు








సత్యం • సమగ్రం • సమూజ బాధ్యత — www.viswamvoice.com


## ఆ ఉత్తరాంధ్ర నేత ఎవరు? - వైసీపీలో విజయసాయిరెడ్డి సస్పెన్స్!

విపక్షం వైసీపీలో మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి రాసిన లేఖ కలకలం సృష్టిస్తోంది. తన లేఖలో వైసీపీ నుంచి బయటకు రావడానికి దారితీసిన కారణాలను స్పష్టం చేయడమే కాకుండా, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిపై విమర్శలు గుప్పించారు విజయసాయిరెడ్డి. ఇదే సమయంలో ఉత్తరాంధ్ర ఇంచార్జిగా తనను తప్పించడానికి సజ్జలతోపాటు ఉత్తరాంధ్ర నేత ఒకరు కుట్ర చేశారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా ఆ ఉత్తరాంధ్ర నేత ప్రస్తుతం పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్నారంటూ లీకులిచ్చారు. విజయసాయిరెడ్డి లేఖలో ఆ ఉత్తరాంధ్ర నేత పేరు రాయకపోవడంతో పార్టీ మారడానికి ప్రయత్నిస్తున్న ఆ నాయకుడు ఎవరంటూ అంతర్గతంగా విస్తృత చర్చ జరుగుతోంది. ఉత్తరాంధ్రకు చెందిన నాయకుడు ఒకరు పార్టీ మారడానికి సిద్దంగా ఉన్నారంటూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇచ్చిన లీకు వైసీపీలో హాట్ టాపిక్ అవుతోంది. స్థానిక ఎన్నికల వేళ ఆ ఉత్తరాంధ్ర నాయకుడు ఎవరు అంటూ సాధారణ కార్యకర్తల నుంచి పార్టీ అధిష్టానం పెద్దలు వరకు ఆరా తీస్తున్నారు. పార్టీ అధిష్టానానికి బాగా దగ్గరగా ఉన్న నేత అంటూ విజయసాయిరెడ్డి చెప్పడంతో ఆ నేత మాజీ మంత్రి అయ్యే అవకాశం ఉందని అనుమానిస్తున్నారు. దీంతో ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన పలువురు మాజీ మంత్రులు, వారి ప్రస్తుత తీరుతెన్నులను చర్చిస్తూ పార్టీ మారేందుకు ఉన్న



అవకాశాలపై ఊహాగానాలు వ్యక్తం చేస్తున్నారు.

**ఆ నేత బొత్స అవ్వొచ్చా?**

పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్న ఉత్తరాంధ్ర నేత అంటూ పేరు చెప్పకుండా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సస్పెన్స్ క్రియేట్ చేయడంతో ఆ నేత బొత్స కావచ్చునేమో అంటూ పలువురు పరిశీలకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఇటీవల వైసీపీ నుంచి జనసేనలో చేరనున్నారంటూ బొత్సపై పలు ఉహాగానాలు వ్యాపించాయి. సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారానికి ఎటువంటి ప్రాతిపదిక లేకపోయినా వదంతులు మాత్రం వేగంగా విస్తరించాయి. అయితే ఈ ఊహాగానాలపై బొత్స, ఆయన అనుచరులు స్పందించలేదు. ఊరు, పేరు లేని ప్రచారాన్ని ఖండించాల్సిన అవసరం లేకపోయినా, రాజకీయంగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల వల్ల క్లారిటీ ఇస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కూడా ఈ ప్రచారాన్ని నమ్మి బొత్స పేరు ప్రస్తావించకుండా ఆరోపణలు చేశారా? లేక ఇంకెవరైనా నిర్దిష్టమైన నేత పార్టీ మార్పుపై ఆయనకు సమాచారం ఉందా? అన్న విషయంపై క్లారిటీ రావాల్సివుందని అంటున్నారు.

**ఇంకెవరు అవ్వొచ్చు!**

వైసీపీలో విజయసాయిరెడ్డి పనిచేసిన సమయంలో ఆయనే బలవంతుడు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి అత్యంత సన్నిహితుడు. అలాంటి నేతపై చాడీలు చెప్పి, పదవి నుంచి తొలగించేలా చేయగలిగే నాయకుడు ఉత్తరాంధ్రలో ఎవరై ఉంటారనేది విస్తృత చర్చగా ఉంది. ఉత్తరాంధ్రలో వైసీపీ హయాంలో చాలా మంది మంత్రులుగా పనిచేశారు. అందరిలో సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమరనాథ్ మాత్రమే నేరుగా అధిష్టానంతో సంప్రదింపులు జరిపే సత్తా ఉన్నా నేతలుగా చెబుతున్నారు. వీరిలో విజయసాయిరెడ్డికి పొగ పెట్టినంత దమ్ము ఎవరికి ఉంది? అన్నదే పార్టీలో చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు. పార్టీని గందరగోళంలోని నెట్టేందుకు విజయసాయిరెడ్డి మైండ్ గేమ్ అడుతున్నారా? లేక నిజంగానే తనను టార్గెట్ చేసిన ఉత్తరాంధ్ర నేతపై అపనమ్మకం కలిగించే వ్యూహంతో లేఖరాశారా అన్నదే తేలాల్సివుందని అంటున్నారు.

కడప వైసీపీ మేయర్...

## కృష్ణా జిల్లా అల్లుడికి జగన్ గ్రీన్‌సిగ్నల్...?



కడప కార్పొరేషన్‌లో ఎలాగైనా విజయం సాధించి, తమ కంచుకోటను కాపాడుకోవాలని వైఎస్సార్‌సీపీ గట్టి పట్టుదలతో ఉంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కడప మేయర్ పదవిపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఒకవేళ కడప మేయర్ స్థానం ఓసీ జనరల్‌కు కేటాయిస్తే, వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసేందుకు పలువురు ఆశావాహులు ఆసక్తి చూపుతున్నారు. వీరిలో వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన డాక్టర్ గోసుల శివభారత్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కడప నివాసి అయిన డాక్టర్ శివభారత్‌రెడ్డికి వైఎస్సార్ కుటుంబంతో దశాబ్దాల కాలంగా మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయి. ఆయన సతీమణి సీతారామలక్ష్మి కృష్ణా జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దుట్టా రామచంద్రరావు కుమార్తె. వైఎస్ రాజశేఖరరెడ్డితో దుట్టా కుటుంబానికి సుదీర్ఘ అనుబంధం ఉంది. వైఎస్సార్, దుట్టా ఇద్దరు కలిసి చదువుకున్నారు. ఈ క్రమంలోనే దుట్టాకు జగన్ 2014లో గన్నవరం అసెంబ్లీ టిక్కెట్ కూడా ఇచ్చారు. ఇక దుట్టా అల్లుడు శివభారత్‌రెడ్డి భార్య కాపు (బలిజ) సామాజిక వర్గానికి చెందినవారు. దీంతో కడప నగరంలో గణనీయంగా ఉన్న బలిజ సామాజిక వర్గ ఓటర్ల మద్దతు కూడా ఆయనకు లభించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. శివభరత్ రెడ్డి భార్య ప్రస్తుతం కృష్ణా జిల్లా ఉంగుటూరు వైసీపీ జడ్పీటీసీగా ఉన్నారు. ఇక శివభరత్ రెడ్డికి వైఎస్ జగన్‌తో మంచి స్నేహం ఉండటం, వివాద రహితుడు, విద్యావంతుడు కావడం, స్థానికంగా ఆర్థికంగా స్థితిమంతుడు కావడం డాక్టర్ శివభారత్‌రెడ్డికి రాజకీయంగా పెద్ద కలిసివచ్చే అంశాలు ప్రస్తుతం ఆయన స్థానికంగా మద్దతు కూడగట్టే పనిలో ఉన్నారని సమాచారం. కడప నగరంలో వైఎస్సార్‌సీపీ ప్రభావం గట్టిగా ఉన్నందున, సరైన అభ్యర్థిని రంగంలోకి దించితే గెలుపు సులువవుతుందని పార్టీ భావిస్తోంది. రిజర్వేషన్ అనుకూలించడం, జగన్ ఆశీస్సులు ఎలాగూ ఉంటాయన్న ధీమాతో శివభారత్‌రెడ్డి పోటీ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. కడప నగరంలోని డివిజన్ల విభజనపై ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. ఈ న్యాయపరమైన అంశాలు కొలిక్కి వచ్చిన తర్వాతే ఎన్నికల హడావిడి మొదలవుతుంది.

## విజయనగరంలో బొత్స / కిమిడి..?! నాడు సీనియర్లు.. నేడు వారసులు

స్థానిక ఎన్నికల సందర్భంగా విజయనగరం జిల్లాలో ఇద్దరు సీనియర్ నేతల మధ్య రాజకీయం కాకపుట్టిస్తోంది. టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, మాజీ మంత్రి బొత్స సత్యానారాయణ మధ్య మరోమారు ప్రతిష్టాత్మక పోరు జరిగే సంకేతాలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో పరస్పరం ఢీకొన్న ఈ ఇద్దరు ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో తమ వారసులను రంగంలోకి దింపాలని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ ఇద్దరు సొంత నియోజకవర్గం చీపురుపల్లిలో పట్టుకోసం ప్రయత్నిస్తున్నారు. మొత్తం ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కళావెంకటరావు తాజాగా చీపురుపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత ఎన్నికల్లో అనూహ్యంగా చీపురుపల్లి టికెట్ దక్కించుకున్న ఆయన అక్కడ బలమైన నేతగా ఎదిగిన బొత్సను ఓడించారు. బొత్స కూడా చీపురుపల్లి నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక ఈ ఇద్దరు ఉమ్మడి రాష్ట్రంలోను ఆ తర్వాత మంత్రులుగా పనిచేశారు. బొత్స పీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తే, కళావెంకటరావు రాష్ట్ర విభజన తర్వాత ఏపీ టీడీపీకి అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ విధంగా సమ ఉజ్జీలుగా ఉత్తరాంధ్ర రాజకీయాలను శాసిస్తున్న ఈ ఇద్దరు నేతలు ప్రస్తుతం రిటైర్మెంటుకు దగ్గరలో ఉన్నారు. దీంతో స్థానిక ఎన్నికల్లో తమ వారసులను బరిలోకి దింపాలని చూస్తున్నారు. ఒకే సామజికవర్గం, ఒకే నియోజకవర్గం నుంచి తలపడుతున్న కిమిడి కళావెంకటరావు, బొత్స సత్యానారాయణ ప్రస్తుతం ఒకే విధమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ ఇద్దరి కుటుంబాల నుంచి చాలా మంది రాజకీయాల్లో ఉన్నప్పటికీ వారి సొంత పిల్లలకు మాత్రం ఇంతవరకు రాజకీయ పదవులు కట్టబెట్టలేదు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ఇద్దరికి 70 ఏళ్లు నిండుతుండటంతో ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తమ వారసులకు రాజకీయ ప్రవేశానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే కళావెంకటరావు కుమారుడు రామ్




మల్లిక్ నాయకుడు చీపురుపల్లి నియోజకవర్గంలో తండ్రి తరఫున చురుగ్గా పనిచేస్తున్నారు. అయితే ఆయనకు అధికారిక పదవి లేకపోవడంతో వచ్చే స్థానిక ఎన్నికల్లో జడ్పీటీసీగా బరిలోకి దింపి జడ్పీ చైర్మను చేయాలని కళావెంకటరావు భావిస్తున్నారని చెబుతున్నారు. ఇదే సమయంలో గత ఎన్నికలలో ఎదురైన పరాభవంతో తిరిగి చీపురుపల్లిలో నిలదొక్కుకోవాలని చూస్తున్న మాజీ మంత్రి బొత్స స్థానిక ఎన్నికలను వేదికగా పకడ్బందీ వ్యూహరచన చేస్తున్నారు. తన కుమార్తెను జడ్పీ చైర్మను అభ్యర్థిగా ఇప్పటకే ఆయన ప్రకటించారు. చీపురుపల్లి నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో ఎక్కడో ఒక చోట జడ్పీటీసీగా నిలపాలని ప్లాన్ చేస్తున్నారని చెబుతున్నారు. అటు టీడీపీలో కూడా ఎమ్మెల్యే కళావెంకటరావు కుమారుడు రామ్ మల్లిక్ నాయుడిని తమ మండలం నుంచి పోటీ చేయాలని నాలుగు మండలాల నేతలు ఆహ్వానిస్తున్నారని అంటున్నారు. దీంతో వచ్చే స్థానిక ఎన్నికల్లో సీనియర్ నేతల వారుసల మధ్య పోరు అనివార్యంలా కనిపిస్తోందని చెబుతున్నారు. ఇక ఇద్దరు సీనియర్ నేతలు తమ వారసులను స్థానిక ఎన్నికల్లో నిలపాలని ఇప్పటికే నిర్ణయించినందున, వారసులు ఇద్దరు పరస్పరం తలపడతారా? లేదా? అన్నదే ఉత్కంఠ రేకెత్తిస్తోంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఎమ్మెల్యే కళావెంకటరావు కుమారుడు గరివిడి జడ్పీటీసీగా పోటీకి రెడీ అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో బొత్స కుమార్తె అనుష కూడా గరివిడి లేదా మెరకముడిదాం మండలాల నుంచి బరిలోకి దిగాలని భావిస్తున్నారని చెబుతున్నారు. ఈ ఇద్దరు వారసులు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. కార్యకర్తలతో మమేకమవుతున్నారు. అయితే ఇద్దరు తొలిసారిగా రాజకీయ రణక్షేత్రంలోకి దిగుతుండటమే ఆసక్తి రేపుతోంది. విజయనగరం జడ్పీ చైర్మను పీఠం గత 20 ఏళ్లలో సుమారు 15 ఏళ్లు బొత్స కుటుంబం చేతిలోనే ఉంది. ప్రస్తుత చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాజీ మంత్రి బొత్సకు స్వయాన మేనల్లుడు. ఈయన ప్రస్తుతం చీపురుపల్లి నియోజకవర్గం పరిధిలోని మెరకముడిదాం జడ్పీటీసీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2006లో బొత్స సతీమణి ఝాన్సీలక్ష్మి, ఆమె తర్వాత బొత్స కుటుంబానికి చెందిన బడ్డుకొండ అప్పలనాయుడు జడ్పీ చైర్మనుగా పనిచేశారు. ఈ ఇద్దరు తర్వాత బొత్స అనుచరుడు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కొన్నాళ్లు చైర్మనుగా వ్యవహరించారు. వీరి తర్వాత ఐదేళ్ల పాటు 2014-19 మధ్య టీడీపీ జడ్పీ పీఠాన్ని అధిష్టించింది. ఇప్పుడు వైసీపీ ఖాతాలో ఉన్న ఈ పీఠాన్ని మళ్లీ దక్కించుకోవాలని టీడీపీ పావులు కదుపుతుండగా, ఎమ్మెల్యే కళావెంకటరావు కుమారుడు జడ్పీ చైర్మను పీఠంపై కన్నేయడంతో ఉత్కంఠ పోరుకు రంగం సిద్ధమవుతోందని అంటున్నారు. బొత్స కోటను బద్ధలు చేయగలిగే శక్తి తమ కుటుంబానికే ఉందని చెబుతున్న ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఈ విషయమై టీడీపీ అధిష్టానానికి తెలియజేశారని అంటున్నారు. మొత్తానికి విజయనగరం జడ్పీ పీఠం ఇద్దరు సీనియర్లు, వారి వారసుల మధ్య టగ్ ఆఫ్ వార్‌గా మారేలా కనిపిస్తోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## 'ప్రత్యక్ష ఎన్నిక' 'పోటీ' పెంచుతుందా..?



మునిసిపల్ చైర్మన్, కార్పొరేషన్ మేయర్ పదవులకుకూడా ప్రత్యక్ష ఎన్నికలు తీసుకువచ్చిన నేపథ్యంలో ఆయా పదవులకు సంబంధించిన చర్చ జోరుగా సాగుతోంది. గతంలో ఎన్నికలు అయి పోయిన తర్వాత..కోటాల వారీగా మేయర్, మునిసిపల్ చైర్మన్ లేదా చైర్ పర్సన్‌లు పార్టీలు ఎంపిక చేసేవి. దీంతో పార్టీల్లో ఈ పదవుల కోసం ఎన్ని కల అనంతరం.. చర్చ సాగేది. కానీ, తాజాగా ఎన్నికలకు ముందే ఈ పదవులకు అభ్యర్థులను ఖరారు చేయడం గమనార్హం. వారిని కూడా ఎన్నికునే అవకాశం ప్రజలకే ఇవ్వడం విశేషం. ఈ నేపథ్యంలో అధికార పార్టీ టీడీపీ ఆలోచన విధానం డిఫరెంట్‌గా ఉంది. మేయర్ లేదా మునిసిపల్ చైర్మన్ పదవికి ఎంపిక చేసే అభ్యర్థుల ద్వారా.. స్థానిక ఎన్నికలు ప్రభావితం అవుతాయని.. తద్వారా గెలుపు గుర్రం ఎక్కేందుకు అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అభ్యర్థులను కూడా పార్టీనే ఎంపిక చేయనుంది. అయితే..ఇక్కడే పెద్ద సమస్య తెరమీదికి వస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. మేయర్, మునిసిపల్ చైర్మన్ పదవులు స్థానికంగా రాజ్యాంగ హోదాతో కూడి ఉంటాయి. వారికి దక్కే గౌరవం కూడా భిన్నంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆయా పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం అంటే.. ముందు గానే అభ్యర్థులను ఖరారు చేసేయడం అన్నమాట. ఇది ప్రజల కోణంలో చూసుకుంటే.. వారికి నచ్చిన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుంది. కానీ, పార్టీల పరంగా చూస్తే మాత్రం ఇది ఒకింత ఇబ్బందికర వాతావరణానికి దారి తీయొచ్చని అంటు న్నారు. ఉదాహరణకు ఒక నాయకుడు లేదా నాయకురాలు ఈ పదవిపై ఆశలు పెట్టుకుంటే.. తాజా విధానంలో వారికి అవకాశం రాకపోతే.. ఏంటి పరిస్థితి? అనేది ప్రశ్న. పాత విధానంలో ఎన్నికలు పూర్తయ్యాక.. ఎంపిక ఉండేది. దీంతో ఆశావహులు పోటీ తత్వంతో పనిచేసేవారు. ఎన్నికల్లో గెలుపు గుర్రం ఎక్కితే.. మేయర్, డిప్యూటీ మేయర్.. సహా ఇతర కీలకమైన పదవులు దక్కుతాయన్న ఆశ ఉండేది. కానీ, ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికల కారణంగా.. మునిసి పల్ చైర్మన్, మేయర్ పదవులకు అభ్యర్థులను ముందుగానే నిర్ణయించేస్తే.. అది ఆయా పదవులను ఆశిస్తున్నవారి ని ఖచ్చితంగా ప్రభావితం చేస్తుందన్న అంచనాలు ఉన్నాయి. అయితే.. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు మాత్రం ప్రజల అభిప్రాయానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో ప్రత్యక్ష ఎన్నికలకే మొగ్గు చూపుతున్నారు.







## పాకిస్థాన్‌పై భారత వ్యూహం మారింది

### 'ఆపరేషన్ సిందూర్'తో సరికొత్త హెచ్చరిక జారీ చేసిన మాజీ ఆర్మీ చీఫ్ నరవణే

పాకిస్థాన్ పట్ల భారతదేశపు సైనిక, దౌత్య విధానాల్లో విప్లవాత్మకమైన మార్పు వచ్చిందని 'ఆపరేషన్ సిందూర్' స్పష్టం చేసిందని మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎం.ఎం. నరవణే వ్యాఖ్యానించారు. శనివారం వడోదరలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఉరి, పుల్వామా, బాలాకోట్ ఘటనల సమయంలో భారత సైనిక దాడులు కేవలం సరిహద్దు ప్రాంతాల్లోని ఉగ్రవాద స్థావరాలకే పరిమితమయ్యేవని ఆయన గుర్తుచేశారు. అయితే పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని తెలిపారు. ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్థాన్ లోపలి ప్రాంతాల్లో దాక్కున్న ఉగ్రవాదులతో పాటు, వారికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు ఇస్తున్న శక్తులపై కూడా భారత్ విరుచుకుపడిందని వివరించారు. ఉగ్రవాదులు, వారి వెనుక ఉన్న సూత్రధారులు ఎంత దూరంలో దాక్కున్నా సరే దెబ్బతీసి తీరుతామని భారత్ ఈ చర్యతో స్పష్టమైన సందేశమిచ్చిందని ఆయన నొక్కిచెప్పారు. పాకిస్థాన్‌తో మెత్తటి వైఖరి అవలంబించే రోజులు చెల్లిపోయాయనడానికి 'ఆపరేషన్



సిందూర్' ఒక బలమైన ఉదాహరణ. సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ ఉగ్రమూకలకు ఆశ్రయమిచ్చే పాకిస్థాన్‌కు సైనికపరంగా కోలుకోలేని దెబ్బకొట్టడమే భారత భద్రతకు ఏకైక మార్గం. ఉగ్రవాద మూలాలను వారి సొంత భూభాగంలోనే మట్టుబెట్టే ఈ కఠిన వైఖరిని భారత్ ఇకపై కూడా ఇలాగే కొనసాగించినప్పుడే సరిహద్దుల్లో శాశ్వత ప్రశాంతత సాధ్యమవుతుంది.








### కోకో బీచ్‌లో కొలువుదీరనున్న

# కాలభైరవ స్వామి ఆలయం

## ఆలయ నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రా గోవాగా పేరొందిన ఎస్.యానాం కోకో బీచ్ ఆవరణలో నూతనంగా నిర్మించనున్న కాలభైరవ స్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. స్థానిక శాసనసభ్యుడు అయితాబత్తుల ఆనందరావు ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో పాటు పర్యాటకపరంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన ఎస్.యానాం కోకో బీచ్ ప్రాంతంలో కాలభైరవ స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం సంతోషకరమైన విషయమన్నారు. ఆలయ నిర్మాణం పూర్తయిన అనంతరం ఈ ప్రాంతానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఆధ్యాత్మిక వాతావరణం మరింత అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఆలయ నిర్మాణంతో కోకో బీచ్ ప్రాంతం మరింత ఆధ్యాత్మిక శోభను సంతరించుకోవడంతో పాటు పర్యాటక ఆకర్షణ కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. కాలభైరవ స్వామి ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచేలా నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, రహదారి తదితర సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కోకో బీచ్ ఇప్పటికే పర్యాటకులను ఆకర్షిస్తున్న ప్రాంతంగా గుర్తింపు పొందిందని, ఇక్కడ ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఆలయం నిర్మాణం పూర్తయితే భక్తులు, పర్యాటకుల రాక మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. స్థానికుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆనందరావు తెలిపారు. భూమిపూజ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, స్థానిక కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, వేదపండితులు, భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

### స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుల్లో

# పీజీఆర్ఎస్ సేవలు తప్పనిసరి

## జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సేవలను అన్ని పని దినాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా, సులభంగా అందించడంలో స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులతో సచివాలయాలకు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి, వారి ఫిర్యాదులను స్వీకరించి సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వ్యవసాయ సహాయకులు, సర్వే సహాయకులు, రెవెన్యూ సహాయకులు, పశుసంవర్ధక సహాయకులు, ఇంజినీరింగ్ సహాయకులు తదితర ప్రత్యేక విధుల సిబ్బంది తమకు కేటాయించిన స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి విధులకు హాజరైనప్పటికీ నిర్ణీత సమయంలో ప్రజా ఫిర్యాదులను స్వీకరించడం, వాటి పరిష్కారానికి అవసరమైన సేవలు అందేలా సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇతర అధికారిక విధుల కోసం డెప్యుటేషన్‌పై వెళ్లిన సిబ్బందికి ఈ ఆదేశాలు వర్తించవని తెలిపారు. ప్రజల ఫిర్యాదులను స్వీకరించడం, వాటిని సత్వరంగా పరిష్కరించడం, అవసరమైన పౌర సేవలను అందించడం ప్రతి సంబంధిత ఉద్యోగి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు ఈ ఆదేశాలను కచ్చితంగా అమలు చేసి, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సేవలు ఎటువంటి అంతరాయం లేకుండా అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన, సత్వరమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశగా ప్రతి సచివాలయ ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల కోరారు.

# ఏపీలో పారిశ్రామిక విప్లవానికి ప్రణాళిక

## 25 భారీ పార్కుల అభివృద్ధికి ఏపీఐఐసీ వ్యూహం




**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించేందుకు ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 25 భారీ పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయాలని నిశ్చయించుకున్న యంత్రాంగం, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ నిధులను గరిష్ఠంగా వినియోగించుకోవాలని భావిస్తోంది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భారత్ డెవలప్‌మెంట్ విగ్యాన్ యోజన (భవ్య)' కింద 22 పార్కులను ప్రతిపాదించడమే కాకుండా, వీటికి అనుబంధంగా శ్రీకాకుళం, శ్రీసత్యసాయి, అనకాపల్లి జిల్లాల్లో కొత్త పార్కుల ఏర్పాటుకు భూసేకరణ వేగవంతం చేసింది. ఇప్పటికే 22 పార్కుల కోసం 12,000 ఎకరాలను సేకరించిన ఏపీఐఐసీ, మిగిలిన మూడు పార్కుల నిమిత్తం మరో 8,000 ఎకరాల సేకరణకు స్పష్టమైన ప్రతిపాదనలు రూపొందించింది. దేశవ్యాప్తంగా రూ. 33,000 కోట్లతో 100 పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయాలనే కేంద్ర ప్రతిపాదనలో భాగంగా, మొదటి విడతలో రాష్ట్రం నుంచి పంపిన 8 ప్రతిపాదనల్లో రెండింటికి ఆమోదం లభించే అవకాశం కనిపిస్తోంది. రెండో విడతలో మరో 16 పార్కుల కోసం నివేదికలు సిద్ధమయ్యాయి. కేంద్రం ఈ పథకం కింద ఎకరానికి రూ. కోటి చొప్పున గ్రాంటుగా ఇస్తుండటం, 90 శాతం భూసేకరణ పూర్తయిన భూములకు ప్రాధాన్యం ఇస్తుండటంతో అధికారులు భూముల లభ్యత ఉన్న ప్రాంతాలకే ప్రాధాన్యం ఇచ్చారు. ఒకవేళ కేంద్ర అనుమతులు ఆలస్యమైనా, మిగిలిన పార్కులను ఏపీఐఐసీ సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని దృఢ నిశ్చయంతో ఉంది. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లా మూలపేట వద్ద 2,000 ఎకరాల్లో కెమికల్ పార్క్ ఏర్పాటు కానుంది. ఇందులో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు రూ. 2,250 కోట్ల పెట్టుబడితో ఫాస్ఫారిక్ యాసిడ్, ఫెర్టిలైజర్ యూనిట్ కోసం 450 ఎకరాలు కేటాయించారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి వద్ద హెచ్ఏఎల్ ఏర్పాటు చేస్తున్న రూ. 15,803 కోట్ల విలువైన అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టుకు అనుబంధంగా మరో 5,000 ఎకరాల్లో భారీ పార్క్ నిర్మాణానికి భూసేకరణ జరుగుతోంది. మరోవైపు అనకాపల్లి జిల్లాలో వేయి ఎకరాల్లో రేర్ ఎర్త్ మినరల్ పార్కును తీర్చిదిద్దుతున్నారు. ఈ వివరాలను ఏపీఐఐసీ వీసీ, ఎండీ దినేష్‌కుమార్ ధృవీకరించారు. ప్రకటనలు, ప్రతిపాదనలు కాగితాల వరకే పరిమితమైతే పరిశ్రమలు రావు. భూసేకరణ వేగవంతం చేయడం ఎంత ముఖ్యమో, ఎకరాకు రూ. కోటి ఇస్తానన్న కేంద్ర గ్రాంట్‌ను సకాలంలో సాధించుకోవడం అంతే కీలకం. అధికారులు కేవలం ప్రతిపాదనలు పంపామని చేతులు దులుపుకోకుండా, కేంద్రం నుంచి నిధులు రప్పించి, మౌలిక వసతులు కల్పించి భూములను పారిశ్రామికవేత్తలకు త్వరగా అప్పగిస్తేనే రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి సాధ్యమవుతుంది.

### 10 టికెట్లు బుక్ చేస్తే

# ఇంటి వద్దకే ఆర్టీసీ బస్సు!

### ఏపీలో కొత్త ప్రయోగం




బస్సు సర్వీసులు తగ్గిపోవడం, కొత్త బస్సులు కొనుగోలు చేయకపోవడం, రద్దీ పెరగడం వంటి కారణాలతో సిబ్బంది తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రయాణికులతో తరచూ ఘర్షణలు, గొడవలు జరుగుతున్నాయి. చేయ్యెత్తిన చోట బస్సులు ఆపాలి. ఇది ఆర్టీసీ నిబంధన. అయితే ప్రస్తుతం అనేక కారణాలతో చేయెత్తిన చోట కాదుకదా కనీసం బస్సు స్టాపుల్లో కూడా బస్సులు నిలపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బస్సు సర్వీసులు తగ్గిపోవడం, కొత్త బస్సులు కొనుగోలు చేయకపోవడం, రద్దీ పెరగడం వంటి కారణాలతో సిబ్బంది తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రయాణికులతో తరచూ ఘర్షణలు, గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీపై ప్రయాణికులలో తీవ్ర అసంతృప్తి పెరిగిపోతోంది. అయితే ఈ పరిస్థితుల్లో ప్రయాణికుల కోసం ఆర్టీసీ బస్సులను ఇళ్ల వద్దకే పంపాలనే వినూత్న నిర్ణయాన్ని తీసుకున్నారు ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు. విజయవాడలో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని భావిస్తున్న ఈ స్కీం ఫలితాలను అధ్యయనం చేసి రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని ప్లాన్ చేస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి.

**విజయవాడ నుంచి ప్రయోగం**

పది మంది కన్నా ఎక్కువ మంది ప్రయాణికులు బస్సును బుక్ చేసుకుంటే ఇంటి వద్దకే వచ్చి ప్రయాణికులను పికప్ చేసుకోవాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా విజయవాడ నగరంలో అమలు చేయాలని భావిస్తోంది. ఈ సరికొత్త విధానాన్ని సమర్థంగా అమలు చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దూర ప్రాంతల మధ్య నడిచే ఏసీ, నాన్ ఏసీ సర్వీసుల్లో ఈ విధానం ప్రవేశపెట్టాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఏసీ ఇంద్ర, అమరావతి, వెన్నెల బస్సులతో పాటు నాన్ ఏసీ సర్వీసులు అయిన నైట్ రైడర్, సూపర్ లగ్జరీ సర్వీసులు, డాల్ఫిన్ క్రూయిజర్ వంటి అత్యాధునిక బస్సులలో ప్రయాణానికి కనీసం పది టికెట్లు బుక్ చేసుకుంటే ప్రయాణికులను వారి ఇళ్ల వద్దకే వెళ్లి ఎక్కించుకోవాలని భావిస్తున్నారు. దీనివల్ల ప్రైవేటు ట్రావెల్స్ కి గట్టి పోటీ ఇవ్వొచ్చునని భావిస్తున్నారు.

**వివాహాలు, విహారయాత్రల కోసం..**

ప్రస్తుతం ఆర్టీసీలో ఒక బస్సు మొత్తాన్ని బుక్ చేసుకుంటేనే ఈ సౌకర్యం కల్పిస్తున్నారు. కానీ, ప్రస్తుతం ప్రైవేటు రంగం నుంచి తీవ్ర పోటీ ఎదురవుతుండటంతో పది టికెట్లు బుక్ చేసినా సరే ఈ సౌలభ్యం కల్పించాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. వివాహాలు, విహారయాత్రలకు వెళ్లాలని అనుకునే వారికి ఈ సర్వీసు ఉపయోగకరంగా ఉంటుందని అంటున్నారు. అదేవిధంగా సుదూర ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఒకేసారి హాస్టల్ నుంచి రావాలి అనుకున్నా, ఒకేసారి వెళ్లాలి అనుకున్నా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చునని చెబుతున్నారు.

**ముఖ్య కూడళ్ల నుంచి సర్వీసులు**

అదేవిధంగా ఆర్టీసీ సర్వీసులను ప్రైవేటు సర్వీసులు మాదిరిగానే ముఖ్య కూడళ్లలో నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రధాన నగరాల్లో ఆయా బస్టాండుల నుంచి మాత్రమే బస్సు సర్వీసులు నడుపుతున్నారు. అయితే ప్రైవేటు సర్వీసులు మాత్రం ఆయా నగరాల్లో ప్రధాన కూడళ్ల వద్దే ఉంచి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లిపోతున్నాయి. దీనివల్ల ప్రయాణికులకు సౌలభ్యంగా ఉండటమే కాకుండా కాలం కలిసివస్తుందని చెబుతున్నారు. దీంతో ఇకపై ఆర్టీసీ సర్వీసులను కూడా బస్టాండ్ తో సంబంధం లేకుండా ముఖ్య కూడళ్ల నుంచి నడిపేలా ప్రణాళిక రచిస్తున్నారని చెబుతున్నారు.

**చార్జీలు తగ్గించే ఆలోచన**

ఇక ఆర్టీసీ నష్టాలను తగ్గించుకోవడంతోపాటు ఆక్యుపెన్సీ పెంచుకోవడానికి కొత్త ఆలోచనలు చేస్తున్నారని చెబుతున్నారు. ప్రధాన నగరాల మధ్య నడిచే బస్సు సర్వీసుల టికెట్ రేట్లను రద్దీకి తగినట్లు సవరించాలని నిర్ణయించారు. ప్రధానంగా రద్దీ లేని సమయంలో గరిష్ఠ ధర కన్నా 10 లేదా 20 శాతం చార్జీలు తగ్గించే ప్రతిపాదనను అధికారులు పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రైవేటులో రద్దీ సమయంలో చార్జీలు పెంచేయడం, రద్దీ లేని సమయంలో చార్జీలను తగ్గిస్తూ ప్రయాణికులను తన్నుకుపోతున్నారని చెబుతున్నారు. రద్దీ సమయంలో ధరలు స్థిరంగా ఉండటం వల్ల ఆర్టీసీ వైపు ప్రయాణికులు చూస్తున్నప్పటికీ రద్దీ లేని సమయంలో ఆర్టీసీ కన్నా తక్కువ చార్జీలు ఉండటం మూలంగా ప్రైవేటు సర్వీసులవైపు ప్రయాణికులు మళ్లుతున్నారని అంటున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు రద్దీ లేని సమయంలో ధరలను తగ్గించాలనే ప్రతిపాదనను ఆర్టీసీ పరిశీలిస్తోందని చెబుతున్నారు.

# అంతరిక్షంలో మరో ఘనతకు ఇస్రో సిద్ధం

## జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 ప్రయోగానికి ముమ్మర ఏర్పాట్లు



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి మరో కీలక ప్రయోగానికి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సర్వం సిద్ధం చేస్తోంది. జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగానికి సంబంధించి ఏర్పాట్లను శాస్త్రవేత్తలు వేగవంతం చేశారు. ఇందులో భాగంగా అత్యంత కీలకమైన మిషన్ రెడీనెస్ రివ్యూ (ఎంఆర్ఆర్), లాంచ్ ఆథరైజేషన్ బోర్డ్ (ఎల్ఏబీ) సమావేశాలను సెప్టెంబరు 1న నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షలలో రాకెట్, ఉపగ్రహ పనితీరుతో పాటు అన్ని సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ప్రయోగానికి సంబంధించిన తుది అనుమతులను మంజూరు చేసి, తదుపరి కౌంట్‌డౌన్ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ వ్యోమనౌక ద్వారా అత్యంత అధునాతన భూ పరిశీలన ఉపగ్రహమైన ఈఓఎస్-05 ను నింగిలోకి పంపి, నిర్ణీత సబ్-జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టడమే ఇస్రో ప్రధాన లక్ష్యం. అంతరిక్ష ప్రయోగాల రంగంలో ప్రపంచ దేశాలకు సవాలు విసురుతూ ఇస్రో సాధిస్తున్న వరుస విజయాలు భారత్ కీర్తికిరీటంలో మరొక విప్లవాత్మక మైలురాయిగా నిలుస్తున్నాయి. సాధారణ ప్రయోగాలకే పరిమితం కాకుండా, అత్యంత సంక్లిష్టమైన జియోసింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (జీఎస్ఎల్‌వీ) సాంకేతికతను స్వదేశీ పరిజ్ఞానంతో పూర్తి స్థాయిలో పురోగమించేలా తీర్చిదిద్దడంలో శాస్త్రవేత్తలు సాధించిన విజయం ప్రశంసనీయం. ఈ ప్రయోగం కూడా సఫలీకృతమై, అంతరిక్షంలో భారత సాంకేతిక సత్తాను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పడం ఖాయంగా కనిపిస్తోంది.

# పవన్ కళ్యాణ్ సేవలు భావితరాలకు ఆదర్శం

## కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, మాజీ మంత్రి చిక్కాల





**కాజులూరు, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సేవలో చూపిస్తున్న నిబద్ధత, సమాజం పట్ల ఆయనకున్న బాధ్యత, ప్రజల కోసం నిరంతరం చేస్తున్న సేవలు భావితరాలకు ఆదర్శనీయమని కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కాజులూరులో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముందస్తు జన్మదిన వేడుకల్లో భాగంగా జనసేన నాయకులు అన్యం శ్రీరామ్ ఆధ్వర్యంలో శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్ వారి మెగా రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దివంగత జనసేన నాయకులు అన్యం గోవిందును స్మరించుకుంటూ ఈ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వాసంశెట్టి సత్యం, మాజీమంత్రి చిక్కాల రాంచంద్రరావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా రక్తదానం, వైద్య సేవలు, పేదలకు సహాయం వంటి సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. రాజకీయాలను పదవుల కోసం కాకుండా ప్రజలకు సేవ చేసే ఒక గొప్ప అవకాశంగా భావిస్తూ పవన్ కళ్యాణ్ ముందుకు సాగుతున్నారని అన్నారు. సాటి వ్యక్తి ప్రాణం నిలిపే రక్తదాన కార్యక్రమాన్ని పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా నిర్వహించడం స్ఫూర్తిదాయకమని వాసంశెట్టి సత్యం అన్నారు. రక్తదానం, ఉచిత వైద్య, కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, రామచంద్రపురం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా లక్ష్మి తదితరులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన సేవా కార్యక్రమాల్ని ప్రత్యేకంగా అభినందించారు. పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా చేపడుతున్న ప్రతి సేవా కార్యక్రమం ఒక కొత్త స్ఫూర్తికి నాంది కావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ముత్యాల జయలక్ష్మి, చిక్కాల గణేష్, చిక్కాల దొరబాబు, దుగ్గన బాబ్జి, కోనసీమ జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి వనుం వీరబ్రహ్మం, కాజులూరు మండల జనసేన అధ్యక్షులు బోండా వెంకన్న, మండల గ్రామాలకు చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, అభిమానులు పాల్గొన్నారు.

## మేయర్ సీటుపై

# కమ్మ నేతల కన్ను?




విశాఖ మేయర్ అంటే ఎంతో ప్రతిష్టాత్మకమైనది అన్నది తెలిసిందే. ఏడాదికి అయిదు వేల కోట్ల బడ్జెట్ తో కార్పోరేషన్ నిర్వహణ సాగుతోంది. రానున్న అయిదేళ్లలో ఇది కాస్తా పది వేల కోట్లకు చేరుకుంటుంది అన్నది కూడా ఉంది. అలాగే శివారు ప్రాంతాలలోని గ్రామ పంచాయతీలు మండలాలను విలీనం చేసుకోవడం ద్వారా బృహత్ విశాఖ కార్పోరేషన్ గా అవతరించనుంది. ఇక జీవీఎంసీ పరిధిలోనే దేశంలో అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం అవుతోంది. ఐటీ కంపెనీలు వస్తున్నాయి. అలాగే మిట్టల్ స్టీల్ ప్లాంట్ తో పాటు అనేక పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. దాంతో జీవీఎంసీ ఆర్థికంగా అన్ని విధాలుగా ముందుకు దూసుకుని పోయే అవకాశాలు ఉన్నాయి అని అంటున్నారు. కూటమి ప్రభుత్వానికి విశాఖ మీద ఫోకస్ ఉంది. ప్రత్యేకించి టీడీపీ విశాఖను ఆర్థిక పారిశ్రామిక రాజ్ధానిగా భావిస్తోంది. ఆ విధంగానే అభివృద్ధి చేస్తోంది.

**టీడీపీ టార్గెట్ :** విశాఖ మేయర్ సీటుని 1987లో టీడీపీ దక్కించుకుంది. ఆనాడు డీవీ సుబ్బారావు ఎన్నిక అయ్యారు. అది ప్రత్యక్ష ఎన్నికలలోనే జరిగింది. అయిదేళ్ల పాటు ఆనాటి పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఈ రోజుకీ చెప్పుకుంటారు. ఇక ఆనాటి నుంచి మళ్ళీ మేయర్ సీటు టీడీపీకి దక్కలేదు. 2025 లో వైసీపీ మేయర్ మీద అవిశ్వాసం ప్రవేశపెట్టి ఒక ఏడాది మాత్రం టీడీపీ పాలన చేసింది. ఈసారి అలా కాదు పూర్తి కాలం తాము అధికారంలో ఉంటే విశాఖకు ఒక రూపు షేపూ తీసుకుని రావచ్చు అని పసుపు పార్టీ ఆలోచిస్తోంది. దాంతో విశాఖ మేయర్ సీటు టీడీపీకే దక్కుతుందన్నది అందరికీ తెలిసిపోయింది. దాంతో టీడీపీలోనే పెద్ద ఎత్తున పోటీ ఏర్పడుతోంది.

**కమ్మ నేతల చూపు :** విశాఖ మేయర్‌గా ఇప్పటిదాకా చూస్తే రెడ్డి, బ్రాహ్మణ, వెలమ, యాదవ, మత్స్యకార,, గవర సామాజిక వర్గాలకు చెందిన వారు పనిచేశారు. ఈసారి ఇతర సామాజిక వర్గాలకు కూడా అవకాశం ఇవ్వాలని డిమాండ్ పెరుగుతోంది. మేయర్ గా కాపులకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఎందుకంటే ఎక్కువ జనాభాగా వారు ఉన్నారని గుర్తు చేస్తున్నారు. అదే సమయంలో కమ్మ సామాజిక వర్గం నేతల నుంచి ఈసారి అనూహ్యంగా రేసులో చాలా పేర్లు వినిపిస్తున్నాయి. దాంతో విశాఖ మేయర్ సీటు ఎవరికి దక్కుతుందన్నది టీడీపీలో తీవ్ర స్థాయిలో చర్చ సాగుతోంది.

**వీరంతా పోటీకి :** కమ్మ సామాజిక వర్గం నుంచి విశాఖ జిల్లా టీడీపీ ప్రెసిడెంట్ గా ఉన్న చోడె వెంకట పట్టాభిరాం పోటీలో ఉంటారని ప్రచారం ఊపందుకుంది. ఆయన కొద్ది నెలల క్రితం కీలకమైన పార్టీ పదవిని అందుకున్నారు. దాంతో పాటు రుషికొండ వెంకటేశ్వర స్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ గా నామినేటెడ్ పదవిని అందుకున్నారు. ఆయన గతంలో జీవీఎంసీలో కార్పోరేటర్ గా పనిచేయడమే కాదు టీడీపీ తరపున ఫ్లోర్ లీడర్ గా పనిచేశారు. దాంతో ఆయనకు జీవీఎంసీ పాలనా వ్యవహారాల మీద పూర్తి అవగాహన ఉందని అంటున్నారు. దాంతో ఆయన పేరుని రేసులో ముందుకు తెస్తున్నారు. ఆయన కూడా సుముఖంగా ఉన్నారని అంటున్నారు. ఆయన అభ్యర్థిత్వం పట్ల టీడీపీ పెద్దలు సానుకూలంగా ఉంటారని కూడా మాట వినిపిస్తోంది.

**ఆయన చూపు మేయర్ సీటు మీద :** అలాగే విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు కూడా తన కుమారుడుని మేయర్ సీటు కోసం ముందు వరసలోకి తెస్తున్నారు అని అంటున్నారు. ఇప్పటికే యువ నేతగా ఉన్న ఆయన విశాఖ తూర్పు నుంచి ఎమ్మెల్యేగా పోటీకి దిగుతారు అని ప్రచారం ఉంది. కానీ ఇపుడు ఆయన చూపు మేయర్ సీటు మీద పడింది అని అంటున్నారు. సీనియర్ నేతగా ఉన్న వెలగపూడికి మంత్రి పదవి అయితే దక్కాల్సి ఉంది. కానీ సామాజిక సమీకరణలో ఇవ్వలేకపోయారు. దాంతో ఆయన కుమారుడికి మేయర్ సీటు ఇస్తారా అన్న చర్చ అయితే సాగుతోంది. వీరిద్దరితో పాటు మరికొందరు కమ్మ నేతల చూపు కూడా విశాఖ మేయర్ సీటు మీద ఉంది. అయితే విజయవాడ మేయర్ సీటును బట్టి ఇక్కడ అభ్యర్థి నిర్ణయం టీడీపీ చేస్తుంది అని అంటున్నారు. విజయవాడ మేయర్ సీటు కాపులకు ఇస్తే విశాఖ కమ్మలకు ఇస్తారని కూడా అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారం ఏ మేరకు నిజం అవుతుంది అన్నది.

# అటు కూటమి బలం.. ఇటు జగన్ వార్నింగ్... వాళ్లకు టెన్షన్...?



ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులలో తీవ్ర ఆందోళనను నింపుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలోని 16 కార్పొరేషన్ల మేయర్ పదవులతో పాటు, మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల ఎంపిక వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జులకు పెద్ద తలనొప్పిగా మారింది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని స్థానిక ఎన్నికల్లో ఢీకొట్టడం అంత తేలికైన విషయం కాదు. అధికార పక్షానికి ఉండే ఆర్థిక బలం, అధికారుల సహకారం, మరియు స్థానిక అభివృద్ధి కోసం అధికార పార్టీకే ఓటేయాలన్న ఆలోచన ఉంటే ప్రజల మనస్సులను డైవర్ట్ చేయడం ఇవన్నీ ఇప్పుడు వైసీపీ నాయకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇక ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు అవుతోంది. కూటమి ప్రభుత్వంపై అసంతృప్తి ఉన్నా స్థానిక ఎన్నికల్లో ప్రత్యర్థిని గెలిపిస్తే తమ పట్టణాలు అభివృద్ధికి దూరమవుతాయని ఓటర్లలో సందేహం ఉంటుంది. అందుకే స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో విజయం అధికార పార్టీలకే ఉంటుంది. అసలు చాలా చోట్ల ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు పోటీ చేసేందుకే ముందుకు రారు. ఇప్పుడు ఏపీలో కూటమి అంటూ మూడు బలమైన పార్టీలు కలిసి ఉన్నాయి. ఈ కూటమి నేతల సామ, దాన, భేద, దండోపాయాలను తట్టుకుని నిలబడగలిగే బలమైన నేతలు వైసీపీకి దొరకడం కష్టంగా మారింది.

**డైరెక్ట్ ఎలక్షన్ టెన్షన్ :** ఈసారి మేయర్, మున్సిపల్ ఛైర్మన్ల ఎంపిక ప్రత్యక్ష పద్ధతిలో (డైరెక్ట్ ఎలక్షన్) జరగనుండటంతో చివరి నిమిషం వరకు అధికార పార్టీ నుంచి ప్రలోభాలు, ఒత్తిళ్లు ఉండే అవకాశం ఉంది. వీలైనన్ని స్థానాలను ఏకగ్రీవం చేసుకోవాలని కూటమి ప్రభుత్వం భావిస్తుండగా, పోటీ లేకుండా ఏకగ్రీవమైతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీటు ఇచ్చేది లేదని అధినేత జగన్ చేసిన హెచ్చరికలు ఇన్చార్జులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జగన్ ఏకగ్రీవం అయిన నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వను అంటూ ఖరాఖండీగా చెప్పడంతో వైసీపీ ఇన్చార్జ్‌లు పోటీ పెట్టేందుకు అభ్యర్థులను వెతుక్కోవడం, వారికి ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం, గెలిపించుకోవడం లాంటి విషయాల్లో సతమతం కానున్నారు. కొన్ని చోట్ల అభ్యర్థులు ముందుకు వచ్చే పరిస్థితి లేదు. జగన్ ఏకగ్రీవాల విషయంలో వార్నింగ్‌లు ఇవ్వడంతో కూటమి చాలా ప్రెస్టేజ్‌గా తీసుకుని పులివెందుల లాంటి చోట్లే ఏకగ్రీవాలు చేయాలని పట్టుదలతో ఉంది. ఇక మిగిలిన నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇక పార్టీ కేడర్ అయితే ప్రతిపక్షంలో ఉంటూ సొంత డబ్బులు ఖర్చు పెట్టేందుకు నేతలు వెనుకాడుతున్నారు. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే అభ్యర్థుల ఎంపిక పూర్తయి, ఎన్నికలు ముగిసే వరకు వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జులకు టెన్షన్ తప్పేలా లేదు.

# 'మన సాయిరెడ్డి' అని వదిలేశాం.. ఇక నుంచే వేరే ట్రీట్మెంట్.. సజ్జల స్ట్రాంగ్ రియాక్షన్

తనను కోటరీ నాయకుడు అంటూ విమర్శించడమే కాకుండా, నమ్మక ద్రోహి అంటూ తీవ్ర ఆరోపణలు చేసిన మాజీ ఎంపీ వి.విజయసాయి రెడ్డిపై వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ అంటూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి శనివారం విడుదల చేసిన లేఖలో ప్రతి అంశంపై సజ్జల సుదీర్ఘ వివరణ ఇచ్చారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని బలహీనపరచడానికి జరుగుతున్న కుట్రలో భాగంగానే విజయసాయిరెడ్డి తాజా వ్యాఖ్యలు ఉన్నాయని ఆరోపించారు. జగన్మోహనరెడ్డి మత మార్పిడులను ప్రోత్సహించారని విజయసాయిరెడ్డి ఆరోపించడం వాస్తవ దూరమని స్పష్టం చేశారు. మత మార్పిడులను ప్రోత్సహిస్తే ముందుగా విజయసాయిరెడ్డి మతమే మార్చుకునేవారు కదా? అంటూ సజ్జల ప్రశ్నించారు. వైసీపీ అధినేత జగన్, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి లక్ష్యంగా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రాసిన బహిరంగ లేఖ తీవ్ర దుమారం రేపుతోంది. ఈ లేఖలోని అంశాలపై తాను స్పందించకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయనే ఉద్దేశంతో వివరణ ఇస్తున్నట్లు సజ్జల ప్రకటించారు. గతంలో సాయిరెడ్డి తనను ఉద్దేశించిన చేసిన విమర్శలను పెద్దగా పట్టించుకోకపోయిన సజ్జల ఈ సారి మాత్రం కాస్త ఘాటుగానే ప్రతిస్పందించారు. పార్టీని విడిచిపెట్టి వెళ్లిపోయిన నేతలపై తాము ఎప్పుడూ విమర్శలు చేయలేదని చెబుతూనే, విజయసాయిరెడ్డి రాజీనామా చేసిన సమయంలో ఎలాంటి కారణాలు చూపలేదని, సొంత కారణాలతోనే బయటకు వెళ్లిపోయారని గుర్తు చేశారు. వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక, వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని సజ్జల అనుమానం వ్యక్తం చేశారు. జగన్ పై దాడి చేసేందుకు ఎప్పటికప్పుడు కొత్త పాత్రలు తెరపైకి వస్తాయని, ఇప్పుడు విజయసాయిరెడ్డి అనే పాత్ర బయటకు వచ్చిందని వ్యాఖ్యానించారు. సొంత పార్టీ పెట్టుకునే ఆలోచనలో ఉన్న విజయసాయిరెడ్డి ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు జగన్ పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. జగన్ పై విమర్శలు చేస్తే పబ్లిసిటీ వస్తుందనే ఆలోచనతో ఆయన ఇలాంటి లేఖలు రాస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇక తనను కోటరీ నాయకుడిగా అభివర్ణించడంపైనా సజ్జల ఫైర్ అయ్యారు. జగన్ కోటరీకి బంధీ అయితే పార్టీని ఈ



స్థాయికి తీసుకు రాగలిగేవారా? అంటూ ప్రశ్నించారు. తమ పార్టీలో జగన్ ఒక్కరే నాయకుడు అని స్పష్టం చేశారు. జగన్ లేని వైసీపీ లేదే లేదని తేల్చిచెప్పారు. వైసీపీలో జగన్ నెంబరు 2 అయితే సజ్జల నెంబర్ వన్ అంటూ విజయసాయిరెడ్డి చేసిన విమర్శలను ఈ సందర్భంగా ఆయన ఎత్తిచూపారు. ఇక తన ఎదుగుదలను అడ్డుకున్నారని విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణలపైనా సజ్జల వివరణ ఇచ్చారు. పార్టీలో ఎక్కువ పదువులు అనుభవించింది విజయసాయిరెడ్డి మాత్రమే అంటూ స్పష్టం చేశారు. పార్టీలో విజయసాయిరెడ్డికి ఎంతో గౌరవం ఇచ్చారు, ఉన్నతస్థానంలో కూర్చొబెట్టారు. రెండుసార్లు రాజ్యసభకు పంపారు, పార్టీ ప్రధాన కార్యదర్శి, అనుబంధ సంఘాల ఇంచార్జి, పార్లమెంటరీ పార్టీ నేత, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఇలా విజయసాయిరెడ్డి ఎన్నో పదవులను అనుభవించారని గుర్తు చేశారు. తాను జర్నలిజం నుంచి రాజకీయాల్లోకి వచ్చానని, విజయసాయిరెడ్డి కన్నా ముందే సాక్షిలో పనిచేశానని తెలిపారు. పార్టీలో రకరకాల వ్యక్తులు పనిచేస్తారని, వివిధ హోదాల్లో సేవలు అందిస్తారని వివరించారు. అంతా టీమ్ వర్క్ చేస్తేనే పార్టీ నిలుస్తుందన్న విషయాన్ని సజ్జల ఎత్తిచూపారు. విజయసాయిరెడ్డి ప్రతిభతో ఏ పదవి రాలేదని, అంతా జగన్మోహనరెడ్డి దయ, దాక్షిణ్యంతోనే ఆయనకు పదవులు వచ్చాయనే సంగతిని గుర్తు చేశారు. విజయసాయిరెడ్డి సొంతంగా పార్టీ పెట్టుకుంటామంటే ఎవరికీ అభ్యంతరం లేదని సజ్జల స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో పార్టీ పెట్టుకునే హక్కు అందరికీ ఉందని ఉద్ఘాటించారు. వైఎస్ జగన్ పై విమర్శలు చేస్తే ఎక్కువ ప్రచారం వస్తుందనే ఉద్దేశంతోనే రాజకీయాలు చేయాలని అనుకోవడం మాత్రం సరికాదని హితవు పలికారు. ఇకపై వైసీపీపై విజయసాయిరెడ్డి దాడి చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇప్పటివరకు మన సాయిరెడ్డి అన్న భావనతోనే సంయమనం పాటించామని, ఇదే ధోరణి కొనసాగితే వేరే విధంగా ట్రీట్ చేస్తామని హెచ్చరించారు. ఇక తాను టీడీపీతో సంబంధాలు పెట్టుకుని కేసులు లేకుండా చేశానని విజయసాయిరెడ్డి చేసిన విమర్శలపైనా సజ్జల స్పందించారు. ఈ ఆరోపణలతో ఆయన ఎటువైపు పయనిస్తున్నారో అర్థమవుతోందని అన్నారు. విజయసాయిరెడ్డిపై భౌతికదాడి జరిగిందని చెబుతున్నారని, నిజంగా దాడి జరిగినట్లు అయితే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చునని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వంలో పాత సంఘటనలపైనా కేసులు పెడుతున్నారని అన్నారు. విజయసాయిరెడ్డి ఫిర్యాదు చేస్తే ప్రభుత్వం వెంటనే స్పందించే అవకాశం ఉందన్నారు. మొత్తానికి సాయిరెడ్డి ఎపిసోడ్ పై వైసీపీ సీరియస్ గా స్పందించిందని సజ్జల వ్యాఖ్యలు ఆధారంగా అర్థమవుతోందని అంటున్నారు. సాయిరెడ్డి రాసిన రెండు పేజీల లేఖలో ప్రతి అంశాన్ని ప్రస్తావించడం ద్వారా మాజీ ఎంపీ విమర్శల్లో పసలేదని సజ్జల తేల్చిచెప్పారని అంటున్నారు.



# మితిమీరిన వేగం.. ముప్పు తెచ్చే రేసు!



- గోకవరంలో మైనర్ల బైక్ జోరు.. భయాందోళనలో గ్రామస్తులు
- జనాల మధ్య నుంచి దూసుకెళ్తున్న వైనం.. ప్రమాదాలపై ఆందోళన
- తల్లిదండ్రుల గారాబమే పిల్లల నిర్లక్ష్యానికి కారణమా?
- మైనర్ల డ్రైవింగ్‌పై నిఘా పెట్టాలని పోలీసులను కోరుతున్న ప్రజలు

**గోకవరం, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** మితిమీరిన వేగం.. అతి ప్రమాదకరమంటూ హెచ్చరికలు ఉన్నప్పటికీ గోకవరంలో కొందరు మైనర్లు, యువకులు బైకులను అత్యంత వేగంగా నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహదారులపై జనసంచారం ఎక్కువగా ఉన్న సమయంలోనూ వేగాన్ని నియంత్రించకుండా బైకులతో దూసుకెళుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్న వయసులోనే బైకులు నడుపుతున్న కొందరు మైనర్లు ట్రాఫిక్ నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. జనాల మధ్య నుంచి వాహనాలకు తప్పించుకుంటూ వేగంగా వెళ్లే క్రమంలో అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గారాబం కంటే.. పిల్లల భద్రత ముఖ్యం**

పిల్లలపై ప్రేమతో తల్లిదండ్రులు వాహనాలు అందుబాటులో ఉంచడం, డ్రైవింగ్‌కు అనుమతించడం చివరకు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. రహదారి భద్రతపై అవగాహన లేని వయసులో బైక్ నడుపుతూ ప్రమాదానికి గురైతే ఒక్కరి ప్రాణమే కాకుండా మొత్తం కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోతుందని అంటున్నారు. తల్లి కడుపుకోతకు కారణం కాకుండా.. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులు సూచిస్తున్నారు.

**పోలీసుల నిఘా అవసరం..**

గోకవరం ప్రధాన రహదారులు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మైనర్లు బైకులు నడుపుతున్నారో లేదో పోలీసులు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతిరోజూ వాహన తనిఖీలు చేపట్టి, మైనర్లకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వేగ నియంత్రణ, హెల్మెట్ వినియోగం, డ్రైవింగ్ లైసెన్స్ వంటి నిబంధనలపై కఠినంగా వ్యవహరిస్తేనే ప్రమాదాలను కొంతమేర నివారించవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

"బైక్ వేగం కంటే.. ఇంటికి క్షేమంగా చేరడం ముఖ్యం. సరదా కోసం చేసే చిన్న తప్పు.. జీవితాంతం కుటుంబాన్ని కన్నీటిలో ముంచకూడదు" అని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

పుట్టినరోజు పేరుతో

# మహిళపై హత్యాయత్నం


ఇద్దరు నిందితుల అరెస్ట్



**రాజమహేంద్రవరం, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం: పుట్టినరోజు వేడుకల పేరుతో మహిళను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు నిందితులను కోరుకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. గాడాల గ్రామానికి చెందిన మట్టాడి దేవి ప్రసాద్ (25), అతని అన్న మట్టాడి అయ్యప్ప (27)ను ఆదివారం సాయంత్రం గాడాలలో అదుపులోకి తీసుకున్నారు. రాజమహేంద్రవరం కప్పలవారి వీధికి చెందిన గెడ్డం ధనలక్ష్మి అలియాస్ శాంతి (28) దేవి ప్రసాద్‌తో నాలుగేళ్లుగా సహజీవనం చేస్తోంది. ఈ సంబంధాన్ని వ్యతిరేకించిన అయ్యప్ప.. కుటుంబ పరువు పోతుందనే కారణంతో ఆమెను హతమార్చేందుకు తమ్ముడితో కలిసి పథకం వేశాడు. ఈ నెల 25న పుట్టినరోజు వేడుకల పేరుతో శాంతిని గాడాల సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ దేవి ప్రసాద్ ఆమె చేతులను వెనక్కి పట్టుకోగా.. అయ్యప్ప సుత్తితో తల, చెవిపై పలుమార్లు కొట్టాడు. అనంతరం స్కూటీపై సింహాచలనగర్ సమీపంలోని క్వారీ వద్దకు తీసుకెళ్లి మెడకు తీగ చుట్టి క్వారీలో పడేసి వెళ్లిపోయారు. స్పృహలోకి వచ్చిన బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కోరుకొండ పోలీసులు కేసు నమోదు చేసి మూడు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. నిందితుల నుంచి స్కూటీ, సుత్తి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరగా ఛేదించిన పోలీసు బృందాలను అధికారులు అభినందించారు.

యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుదాం..

# విక్షిత్ భారత్‌కు కృషిచేద్దాం..



**రాజమహేంద్రవరం, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే విక్షిత్ భారత్ లక్ష్య సాదనలో భాగంగా,దేశ యువతను మాదకద్రవ్యాల (డ్రగ్స్) బారిన పడకుండా రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం నషా ముక్త్ యువ ఫర్ విక్షిత్ భారత్ సంకల్ప్ అభియాన్ అనే ప్రతిష్టాత్మక జాతీయ ప్రచారాన్ని ప్రారంభించడం జరిగిందని దీనిలో భాగంగా కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) తూర్పుగోదావరి జిల్లా, రెడ్ క్రాస్ జిల్లా, ఈగల్ టీమ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గోరక్షణపేట అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుండి షెల్టాన్ సెంటర్ మీదుగా మాదకద్రవ్యాలు పై ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డాక్టర్ నవీన్,డాక్టర్ దేవిశ్రీ, ఈగల్ టీమ్ ఎస్ఐలు నరేష్ కుమార్, మావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ కుమార్ మాట్లాడుతూ గౌరవ ప్రధానమంత్రి మోడీ దేశ వ్యాప్తంగా సుమారు 10,000 ప్రాంతాల్లో ఏకకాలంలో ఒక కోటి కంటే ఎక్కువ మంది యువత చేత వ్యసన విముక్తిపై అవగాహన కల్పించడం కొరకు ఈ నెల 2వ తేదీ ఆదివారం ఒక ఉద్యమంగా ప్రారంభించారని దీనిలో భాగంగా ఐదో ఆదివారం రాజమండ్రిలో ర్యాలీ చేయడం జరిగిందని అన్నారు. డాక్టర్ నవీన్ మాట్లాడుతూ ఒక దేశం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే అక్కడ పౌరులు, యువత ఆరోగ్యంగా మరియు క్రమశిక్షణతో ఉండటం ఎంతో అవసరం. ఈ యువశక్తి డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండేలా అవగాహన పెంచడం తద్వారా మాదకద్రవ్యాలు వినియోగం లేకుండా చేయడం,డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను స్నేహితులకు,కుటుంబ సభ్యులకు వివరించి ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం పై గ్రామీణ వైద్యులు అవగాహన కల్పించాలని,ఈ అవగాహన మహా ఉద్యమం లో భాగస్వామ్యం అయి అవగాహన కల్పించి యువతను వ్యసనాల బారిన పడకుండా రక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, రెడ్ క్రాస్ జిల్లాఎమ్సీ సభ్యులు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, రాజమండ్రి అధ్యక్షులు రహమాన్ ఖాన్,గౌరవ అధ్యక్షులు బుడ్డిగ అప్పారావు,రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ రమణ,జిల్లా కోశాధికారి డాక్టర్ జి మహాలక్ష్మి,ఎమ్సీ సభ్యులు బి.పద్మావతి, బోను రామకృష్ణ,రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి డ్రగ్ ఎడిక్షన్ కౌన్సిలర్ ఎన్ వాసు,జిల్లా పీఎంపీ సభ్యులు,పోతుల సత్యవర ప్రసాద్, పీవీవీ సత్యనారాయణ, కోల లక్ష్మీనారాయణ,కాపా సత్యనారాయణ, ఏ.నాగేశ్వరరావు, యు.ప్రసాద్ బాబు, జి.వెంకటేష్, డి.గోపి, పార్థసారథి, ఎమ్ మల్లేష్,హీరా,రాజ్యలక్ష్మి, కోల సత్యనారాయణ, హెచ్ఎమ్వీ సత్యనారాయణ, సుంకర శ్రీనివాస్, బాబ్జీ,కె వెంకటేశ్వరరావు, కోదండరామ్,సుదర్శన్,మత్సా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బేడ (బుడ్గ) జంగం ఎస్సీ ఆధ్వర్యంలో

# ర్యాలీ - బహిరంగ సభ

బేడ (బుడ్గ) జంగం ఎస్సీ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో మంజూరు చేయాలి
ప్రధానమంత్రి మోదీ, సీఎం చంద్రబాబుకు బేడ (బుడ్గ) జంగం సంఘం రాష్ట్ర అధ్యక్షులు, వనం నాగేశ్వరరావు



**రాజమహేంద్రవరం, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేడ (బుడగ) జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, వనం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కంబాలచెరువు గాంధీ బొమ్మ నుండి పుష్కర్ ఘాటు బిజెపి ఏర్పాటుచేసిన బహిరంగ సభ వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు వనం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ జాబితాలో 9వ కులంగా ఉన్న బేడ (బుడ్గ) జంగం కులానికి చెందిన వారికి ఆన్‌లైన్‌లో ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు బేడ (బుడ్గ) జంగం ఎస్సీ సర్టిఫికెట్లు మంజూరు చేశారని, రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రి అయిన వెంటనే ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా ఈ వర్గానికి న్యాయం చేయాలని కోరగా, సీఎం అసెంబ్లీ సాక్షిగా న్యాయం చేస్తామని, గతంలో బి గ్రూపులో ఉన్న వీరిని ఏ గ్రూపులో చేర్చుతామని హామీ ఇచ్చారన్నారు. రెండేళ్లు గడిచినా హామీ అమలు కాకపోవడంతో విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ రంగాల్లో రాజ్యాంగ బద్ధ హక్కులకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తురపాటి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు చెన్నూరి రామస్వామి, జాయింట్ జిల్లా అధ్యక్షులు గోతూరి మారిదయ్య, కార్యదర్శి వానరాసి యాదగిరి, కార్యదర్శి-2 పరధక్షిణ గణేష్, దివాన్‌చెరువు బీబీజే అధ్యక్షులు తురపాటి గణపతి, కోశాధికారి పెర్ల రాంబాబు, మోతీ పద్మరాజు, జిల్లా మహిళా నాయకులు కళ్యాణి నూకరాజు మరియు రాజమండ్రి, రాజానగరం, కోరుకొండ, దివాన్ చెరువు అనేకమంది బేడ బుగ్గజంగా ఎస్సీ నాయకులు,మహిళలు పాల్గొన్నారు.

# గెడ్డం ధనలక్ష్మిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఇలాంటి నేరాలు జరగకుండా క్వారీ గోతుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు డిమాండ్



**రాజమహేంద్రవరం, ఆగస్టు 30, విశ్వం వాయిస్ న్యూస్ :** భర్త నిరాదరణకు గురైన ఒంటరి మహిళ గెడ్డం ధనలక్ష్మిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వారిని కఠినంగా శిక్షించాలని రాజమండ్రి నగరపాలకసంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భర్త నుంచి విడిపోయి ఇద్దరు పిల్లలతో ఉన్న గెడ్డం ధనలక్ష్మి బొమ్మూరులో ప్రసాద్ అనే వ్యక్తితో కలిసి ఉంటోందని,ఈనెల 25 న పుట్టిన రోజని చెప్పి ప్రసాద్ సోదరులు ఇద్దరు ఆమెను గాడాల తీసుకువెళ్ళి తమ తమ్ముడిని తమకు దూరం చేశావంటూ ఆమె తలమీద సుత్తితో బలంగా కొట్టి అపస్మారక పరిస్థితిలో ఉన్న ఆమెను ఆటోలో తీసుకువచ్చి రాజమండ్రి క్వారీ గోతుల వద్ద పడేసి వెళ్ళిపోయారని అన్నారు.

**కాగా క్వారీ ప్రాంతంలో ప్రమాదాల**

నివారణకు ఫెన్సింగ్ వేస్తున్న సిబ్బంది తరువాత రోజు ఉదయం 9 గంటల ప్రాంతంలో అక్కడి గోతిలోంచి మూలుగులు వినపడడంతో అటుగా వెళ్లి చూసి బయటకు తీసి 108 అంబులెన్స్లో ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారని,అయితే ఔట్ పోస్టు పోలీసులు కేసు కట్టడంలో జాప్యం చేశారని,ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్ళడంతో ఆయన వెంటనే స్పందించారని బర్రే కొండబాబు చెప్పారు. క్వారీ గోతుల ప్రాంతంలో ఇలాంటి సంఘటనలు, నేరాలు జరగకుండా ఫెన్సింగ్ వేయడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బర్రే కొండబాబు సంబంధిత అధికారులను కోరారు. అలాగే పుష్కరాల నిధులతో ఆ ప్రాంతంలో 100 అడుగుల రోడ్డు నిర్మిస్తే లాలాచెరువు నుంచి నగరంలోకి వెళ్ళే వాహనాలు ఈ మార్గంలో కోరుకొండ వైపు వెళతాయని దాంతో రాజమండ్రిలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని కొండబాబు సూచించారు. రెవెన్యూ, మైన్స్, నగర పాలకసంస్థ, ఆర్ అండ్ బి అధికారులు సమన్వయంతో ఈ పనులు చేసేలా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో గెడ్డం ధనలక్ష్మి తండ్రి కె. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం




# "జైలర్" తప్పుకోబోతున్నాడా?

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా ఇప్పుడు చేసిన అవైటెడ్ సినిమానే జైలర్ 2. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తో చేసిన పార్ట్ 1 సెన్సేషనల్ హిట్ కావడంతో అభిమానులు పార్ట్ 2 కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ సినిమా విషయంలో మొదటి నుంచీ మేకర్స్ లిమిటెడ్ గానే అప్డేట్స్ అందిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఇలా ఫైనల్ గా విడుదల తేదీని ఈ అక్టోబర్ 15కి దసరా కానుకగా విడుదలకి ప్లాన్ చేసారు. అయితే ఇన్ని రోజులు సినిమా విషయంలో ఎలాంటి రాజీ లేదు అనే సినీ వర్గాల్లో వినిపించింది కానీ తాజాగా జైలర్ 2 అనుకున్న సమయానికి రాకపోవచ్చు అనే కొత్త ఊహాగానాలు కూడా మొదలయ్యాయి. దాదాపు రాకపోవడానికే ఛాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. సో దీనిపై మేకర్స్ ఏమన్నా కొత్త అప్డేట్ తో క్లారిటీ ఇస్తారో లేదో చూడాలి. ఇక ఈ సినిమాకి అనిరుద్ సంగీతం అందించగా సన్ పిక్చర్స్ నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

# 'టాక్సిక్' ఇంగ్లీష్ వెర్షన్‌లో ఏమైనట్టు?




ఇప్పుడిప్పుడే ఇండియన్ సినిమా మార్కెట్ పాన్ వరల్డ్ లెవెల్ కి విస్తరిస్తుంది. తన సినిమాలతో దర్శకుడు రాజమౌళి వేసిన బాటలో డైరెక్ట్ ఇంగ్లీష్ లోనే తెరకెక్కించి విడుదల చేసిన భారీ చిత్రమే 'టాక్సిక్'. శాండిల్ వుడ్ రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటించిన ఈ చిత్రం కన్నడ, ఇంగ్లీష్ రెండు భాషల్లో మేకర్స్ ఒకేసారి తెరకెక్కించారు. దీనితో ఇండియన్ సినిమా నుంచి ఇదొక ప్రయోగాత్మక చిత్రంగా హాలీవుడ్ లో కూడా ప్రమోషన్స్, పాపులర్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ లయన్స్ గేట్ వారితో హాలీవుడ్ లో రిలీజ్ చేశారు. సరే థియేటర్స్ లో రిలీజ్ అయ్యింది కానీ ఆ తర్వాత అసలు ఈ సినిమాకి అక్కడ ఎలాంటి రెస్పాన్స్ వచ్చింది అనేది మినిమమ్ కూడా బయటకి రాలేదు. వరల్డ్ వైడ్ 150 కోట్ల పోస్టర్ డే 1 కి మేకర్స్ వేశారు. మేజర్ గా హిందీ, తెలుగు, కన్నడ లోనే సినిమాకి మంచి ఓపెనింగ్స్ దక్కాయి. కానీ డైరెక్ట్ ఇంగ్లీష్ లో కూడా తెరకెక్కించిన ఈ సినిమాకి హాలీవుడ్ లో కనీస ఆదరణ కూడా కరువైంది అని చెప్పక తప్పదు. ఇంగ్లీష్ వెర్షన్ లో 1 మిలియన్ డాలర్ గ్రాస్ కూడా సినిమాకి రాలేదని తెలుస్తుంది. సో మేకర్స్ ఎఫర్ట్స్ పూర్తిగా వృథా అయ్యాయని చెప్పక తప్పదు. కానీ ఒక ప్రయత్నం అయితే చేశారు. సో ఓటిటిలోకి వచ్చాక అయినా సినిమాకి మంచి రీచ్ ఉంటుందో లేదో వేచి చూడాల్సిందే.

### అడ్వాన్స్ సేల్స్‌లో
# అదరగొడుతున్న 'పంజా'!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా సారా జేన్ డైస్ హీరోయిన్ గా దర్శకుడు విష్ణు వర్ధన్ తెరకెక్కించిన స్టైలిష్ గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామా 'పంజా' కోసం అందరికీ తెలిసిందే. అప్పట్లో ఫ్లాప్ గా నిలిచిన ఈ చిత్రం మళ్ళీ థియేటర్స్ లోకి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు కానుకగా విడుదల చేస్తున్నారు. అయితే ఈ సినిమా కోసం అభిమానులు మరోసారి ఆసక్తిగా ఎదురు చూస్తున్న నేపథ్యంలో వరల్డ్ వైడ్‌గా సాలిడ్ బుకింగ్స్‌తో ఈ సినిమా రాబోతుంది. ఇలా వరల్డ్ వైడ్ గా కేవలం అడ్వాన్స్ సేల్స్ తో కోటిన్నరకి పైగా గ్రాస్ ని ఈ చిత్రం సొంతం చేసుకుంది. ఇంకా విడుదలకి రెండు రోజుల గ్యాప్ ఉంది. మరి పవన్ గత సినిమాల రేంజ్ లో ఈ సినిమా కూడా ఓపెనింగ్స్ అందుకుంటుందో లేదో చూడాలి. ఇక ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా క్రేజీ మ్యూజిక్ ఆల్బమ్ అండ్ స్కోర్ అందించగా ఆర్కా మీడియా, సంఘమిత్ర బ్యానర్స్ పై నీలిమ తిరుమల శెట్టి, శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, నగేష్ ముంత నిర్మాణం వహించారు.

### ఆ సినిమాలో ఛాన్స్ అడిగితే
# ఆ హీరో వద్దు అన్నారు..
### షాకింగ్ విషయం చెప్పిన రాజశేఖర్



మొన్నటి వరకు హీరోగా మాత్రమే సినిమాలు తీసిన రాజశేఖర్ ఇప్పుడు సహాయక నటుడిగానూ రాణిస్తున్నారు. యంగ్ హీరోల సినిమాల్లోనూ కీలక పాత్రలతో ఆకట్టుకుంటున్నారు. ఆ మధ్యన నితిన్ 'ఎక్స్ ట్రార్డినరి మ్యాన్' మూవీలో కనిపించిన రాజశేఖర్ లేటెస్ట్ గా బైకర్ సినిమాలోనూ ఓ కీలక పాత్ర పోషించారు. ప్రముఖ నటుడు డా. రాజశేఖర్ ఇటీవల సినిమాల స్పీడ్ తగ్గించారు. ఒకప్పుడు ఆయన సినిమా వస్తుందంటే చాలు ఆడియన్స్ లో తెలియని ఆసక్తి ఉండేది. ఇటీవల కాలంలో రాజశేఖర్ హీరోగా కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్ట్ గానూ నటిస్తున్నారు. మొన్నామధ్య నితిన్ సినిమాలో కీలక పాత్రలో కనిపించి మెప్పించారు. అలాగే శర్వానంద్ హీరోగా నటించిన బైకర్ మూవీలో హీరో తండ్రిగా నటించి అందరిని ఆకట్టుకున్నారు. ఓ వైపు హీరోగా సినిమాలు చేస్తూనే మరో వైపు కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు ఈ సీనియర్ హీరో. అయితే రాజశేఖర్ తన సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఎదురైన కొన్ని ముఖ్యమైన సంఘటనలను, సహనటులతో తనకున్న అనుబంధాన్ని, అలాగే ఇద్దరు స్టార్ హీరోల సినిమాలు ఎలా మిస్ అయ్యాయో కూడా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. రాజశేఖర్ మాట్లాడుతూ ఒక సందర్భంలో మెగాస్టార్ చిరంజీవి గారితో స్నేహం కోసం చిత్రంలో నటించే అవకాశం గురించి ప్రస్తావించారు. ఆ సినిమాలో విజయకుమార్ గారు పోషించిన పాత్రను తాను చేయాలని చిరంజీవి గారిని అడిగానని రాజశేఖర్ గుర్తు చేసుకున్నారు. అయితే, చిరంజీవి గారు "రాజశేఖర్, నువ్వు వయసులో కొంచెం చిన్నవాడివి కాబట్టి ఆ పాత్రకు సూట్ అవ్వకపోవచ్చు" అని సలహా ఇచ్చారని, అది సరైన నిర్ణయమేనని తాను అంగీకరించానని తెలిపారు రాజశేఖర్. అలాగే, నందమూరి బాలకృష్ణ గారితో జరిగిన ఒక ఆసక్తికరమైన సంఘటనను కూడా రాజశేఖర్ వెల్లడించారు. కె.ఎస్. రవికుమార్ దర్శకత్వంలో బాలకృష్ణ గారు నటించిన జై సింహా సినిమాకు సంబంధించి బాలకృష్ణ గారు తనను అడిగారని తెలిపారు. బాలయ్య బాబు గారు స్వయంగా "బ్రదర్, నీకు ఏం కావాలో చెప్పు. ఈ ఫైట్ సీన్స్ కూడా ఈక్వల్‌గా పెట్టుకుందాం, నో ప్రాబ్లం" అంటూ తనను బాగా ఎంకరేజ్ చేశారని రాజశేఖర్ వివరించారు. అయితే, బాలకృష్ణతో చేయాల్సిన మొదటి సినిమా అది కాదని, దానికంటే మెరుగైన సినిమాను తామిద్దరం కలిసి చేయాలని నిర్ణయించుకున్నామని, అందుకే ఆ అవకాశాన్ని వదులుకొని, భవిష్యత్తులో వేరే సినిమా చేద్దామని మాట్లాడుకున్నామని ఆయన పేర్కొన్నారు.

# థాయ్‌లాండ్ చిత్తు చేసిన ఇండియా.. భారత్ జట్టు ఘనవిజయం




2026 మహిళల ఆసియా కప్‌లో భాగంగా ఆగస్టు 30న భారత్, థాయ్‌లాండ్ మహిళల జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్ లో భారత్ జట్టు ఘనవిజయం సాధించింది. మ్యాచ్ లో థాయ్‌లాండ్ జట్టు టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. భారత బ్యాటర్లు థాయ్‌లాండ్ బౌలర్లను ఎదుర్కొంటూ కీలక పరుగులు సాధించారు. అయితే వరుస వికెట్లు కోల్పోవడంతో భారీ స్కోరు చేయలేకపోయారు. చివర్లో బ్యాటర్లు వేగంగా పరుగులు రాబట్టడంతో భారత్ 159 పరుగుల పోరాడదగిన స్కోరును నమోదు చేసింది. దీంతో థాయ్‌లాండ్ ముందు 160 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. మ్యాచ్‌లో విజయం సాధించాలంటే థాయ్‌లాండ్ జట్టు 20 ఓవర్లలో 160 పరుగులు చేయాల్సి ఉంది. కానీ కేవలం 65 పరుగులకే థాయ్‌లాండ్ ఆల్ అవుట్ అవ్వడంతో భారత్ జట్టు విజయం సాధించింది. థాయ్‌లాండ్ జట్టు 16.1 ఓవర్లలో 65 పరుగులకు ఆల్ అవుట్ అయ్యింది.

# కోహ్లీ కొత్త టాటూ.. అర్థం ఏంటో తెలుసా?



టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ కొత్త టాటూ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎడమ చేతిపై గుండ్రంగా, అలల తరహాలో కనిపిస్తున్న ఈ డిజైన్ అర్థంపై ఆసక్తి నెలకొంది. అయితే టాటూ వెనుక వ్యక్తిగత అర్థాన్ని కోహ్లీ లేదా ఆర్టిస్ట్ అధికారికంగా వెల్లడించలేదు. టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ మరోసారి తన కొత్త టాటూతో అభిమానుల దృష్టిని ఆకర్షించారు. ఆయన ఎడమ చేతిపై కనిపిస్తున్న కొత్త టాటూ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గుండ్రంగా ఉండి, మధ్య నుంచి అలల మాదిరిగా బయటకు విస్తరిస్తున్న ఈ డిజైన్‌ను చూసి.. దీని వెనుక ఉన్న అర్థం ఏమిటనే చర్చ మొదలైంది. తాజా సమాచారం ప్రకారం, కోహ్లీ కొత్త టాటూ ఆయన కొనసాగిస్తున్న ఫుల్-స్లీవ్ టాటూ ప్రాజెక్ట్‌లో భాగం. అయితే ఈ కొత్త గుండ్రటి డిజైన్‌కు సంబంధించిన ఖచ్చితమైన వ్యక్తిగత అర్థాన్ని కోహ్లీ లేదా ఆయన టాటూ ఆర్టిస్ట్ ఇప్పటివరకు అధికారికంగా వెల్లడించలేదు. అందువల్ల సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వివిధ అర్థాలను అధికారిక సమాచారంగా భావించకూడదు. ఈ టాటూ ప్రాజెక్ట్‌ను కోహ్లీ జీవిత ప్రయాణం, వ్యక్తిగత పరిణామం, గత అనుభవాలు, ప్రస్తుత వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా రూపొందిస్తున్నట్లు ఏలియన్స్ టాటూ వివరించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే ఆయన చేతిపై శివుడి ప్రేరణతో కూడిన డిజైన్, మండల, లోటస్, పియోనీ వంటి పలు అంశాలు ఉన్నాయి. ఇందులో మండల డిజైన్‌ను బ్యాలెన్స్, డిసిప్లిన్, అంతర్గత సమతుల్యతకు ప్రతీకగా టాటూ స్టూడియో పేర్కొంది. అలాగే లోటస్, పియోనీ పూలను సాధారణంగా ఎదుగుదల, పట్టుదల, మార్పుకు ప్రతీకలుగా భావిస్తారు. అయితే ఈ అంశాలకు కోహ్లీ వ్యక్తిగతంగా ఎలాంటి అర్థం ఇచ్చారన్నది మాత్రం స్పష్టంగా తెలియదు. తాజాగా కనిపిస్తున్న గుండ్రటి డిజైన్‌ను చూస్తే అది వోర్టెక్స్ లేదా రిపుల్ తరహా తరంగాల నమూనాలా కనిపిస్తోంది. దీంతో ఇది మార్పు, పరిణామం లేదా జీవితంలో ముందుకు సాగడాన్ని సూచిస్తుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కానీ ఇవి కేవలం పరిశీలనలు, ఊహాగానాలు మాత్రమే. కోహ్లీ కొత్త టాటూ అర్థం కచ్చితంగా ఇదే అని చెప్పలేం.

### అబ్బో.. బుడ్డోడిలో ఈ లక్షణాలు కూడా ఉన్నాయా?
# శుబ్‌మన్ సర్దుకోవాల్సిందేనా..



దులీప్ ట్రోఫీలో వైభవ్ సూర్యవంశీ స్టాండ్‌ఇన్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టి తొలి డీఆర్ఎస్ తీసుకున్నాడు. ముకేశ్ కుమార్ బౌలింగ్‌లో ఆర్యన్ జుయల్‌పై అప్పీల్‌ను అంపైర్ తిరస్కరించడంతో వైభవ్ రివ్యూ కోరాడు. రీప్లేలో బంతి బ్యాట్‌ను తాకినట్లు తేలడం తో జుయల్ ఔటయ్యాడు. దులీప్ ట్రోఫీలో 15 ఏళ్ల యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ కెప్టెన్‌గా ఆకట్టుకున్నాడు. ఈస్ట్ జోన్, సెంట్రల్ జోన్ మధ్య జరుగుతున్న సెమీఫైనల్‌లో రెగ్యులర్ కెప్టెన్ ఇషాన్ కిషన్ గాయం కారణంగా మైదానం వీడటంతో వైభవ్ స్టాండ్‌ఇన్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. సీనియర్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అతడికి ఇదే తొలి నాయకత్వ అవకాశం. కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన కొద్దిసేపటికే వైభవ్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఈస్ట్ జోన్ బౌలర్ ముకేశ్ కుమార్ వేసిన 40వ ఓవర్‌లో సెంట్రల్ జోన్ బ్యాటర్ ఆర్యన్ జుయల్ 46 పరుగుల వద్ద బ్యాక్‌వర్డ్ పాయింట్ ప్రాంతంలో బ్యాట్‌కు తగిలిన బంతిని వికెట్ కీపర్ అందుకున్నాడు. ఈస్ట్ జోన్ ఆటగాళ్లు గట్టిగా అప్పీల్ చేసినప్పటికీ ఫీల్డ్ అంపైర్ ఔట్ ఇవ్వలేదు. దీంతో సహచరులతో చర్చించిన వైభవ్ చివరి క్షణాల్లో డీఆర్ఎస్ తీసుకున్నాడు. రీప్లేలో బంతి బ్యాట్‌ను తాకినట్లు స్పష్టంగా కనిపించడంతో థర్డ్ అంపైర్ ఆర్యన్ జుయల్‌ను ఔట్‌గా ప్రకటించాడు. వైభవ్ తీసుకున్న తొలి రివ్యూ సక్సెస్ కావడంతో ఈస్ట్ జోన్ శిబిరంలో ఆనందం వెల్లివిరిసింది. జుయల్ ఔట్ అని స్క్రీన్‌పై కనిపించగానే వైభవ్ తన సహచరులతో కలిసి సంబరాలు చేసుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కేవలం 15 ఏళ్ల వయసులోనే బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు నాయకత్వ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తూ వైభవ్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. కెప్టెన్సీ తొలి రోజే ఒత్తిడిలో సరైన నిర్ణయం తీసుకోవడం అతడి క్రికెట్ పరిణతికి నిదర్శనమని అభిమానులు ప్రశంసిస్తున్నారు. రాబోయే రోజుల్లో టీమిండియాకు కూడా కెప్టెన్ అయ్యే క్వాలిటీస్ కనిపిస్తున్నాయ్ అని, ప్రస్తుత టీమిండియా వన్డే, టెస్ట్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు వైభవ్ నుంచి కెప్టెన్సీ విషయంలో పోటీ ఉంటుందని క్రికెట్ అభిమానులు సరదాగా కామెంట్ చేస్తున్నారు.






VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com